AL - HILAL

నెలవంక

మాస పత్రిక

Vol 7, Issue: 55 May - 2011 مجلة الهلال (باللغة التلغوية) – ملحق مجلة البشرى



ఇదీ జీవితం



IPC
لجنة التعريف بالإسلام
ISLAM PRESENTATION COMMITTEE
جمعية النجاة الخيرية

telgo.indd 1 5/3/11 1:25 PM

దేశ రక్షణ ధర్మాన్ని పాటించడంలోనే ఉంది



"అయ్‌కా వారు కూడా దుర్మార్గులే..... హిజ్ర్ వారు కూడా ప్రవక్తలను ధిక్కరించారు. (మరి చూడబోతే) మేము వారికి మా సూచనలను కూడా పొసగాము. అయినప్పటికీ వారు వాటి పట్ల విముఖత చూపుతూ వచ్చారు. వారు నిర్భయంగా పర్వతాలను తొలచి ఇండ్లు నిర్మించేవారు. ఆఖరికి వారిపై తెల తెలవారుతుండగా ఒక కేక విరుచుకు పడింది. అంతే! వారి సంపాదన (ప్రగతి) వారికి ఏమాత్రం పనికి రాకుండా పోయింది." (అల్ హిజ్ర్: 78-84))

telgo.indd 2 5/3/11 1:25 PM

నెలవంక

(AL-HILAL MONTHLY)

Vol 7, ISSUE: 55
May 2011

CHIEF PATRON
Muhammad Ismail Ansari

GENERAL SUPERVISION
Khalid Al-Sab'a

EDITOR
Syed Abdus Salam Omeri

ASSOCIATE EDITOR
Sk. Habeebur Rahman Jamaee

EDITORIAL BOARD
Sk. MOHAMMED SALEEM JAMAEE
Sk. Abdus Salam Omeri
Sk. Muhammad Bilal
Tahera Begum

PHONE
Syed Abdus Salam Omeri
97248933

FAX
22400057

P.O.BOX: 1613
SAFAT-13017, KUWAIT

PUBLISHED BY
IPC
Islam Presentation Committee
Kuwait
www.ipc.org.kw

DESIGN
Nader Belal
مؤسسة زخرف للدعاية والإعلان
Zukhruf Advertising Agency
www.zukhruf.net
Tel. 99993072

ఈ సంచికలో....

దటీజ్ పొలిటిక్స్ ---------- 2
లెక్కల ఘడియ సమీపిస్తోంది..! ---------- 3
ఇదీ జీవితం ---------- 4
పూ పరిమళం ---------- 6
జ్ఞానామృతం ---------- 7
సృష్టిలో దేవుని నిదర్శనాలు ---------- 8
నేను ఇబ్రాహీమ్ ప్రార్థనా ఫలాన్ని.. ---------- 9
సత్య ప్రవక్త (స) వారి సమయస్ఫూర్తి ---------- 10
ఇస్లాం శిక్షణ ---------- 12
కవితా కుసుమాలు ---------- 13
మానవ జీవన జ్యోతి ఖుర్ఆన్ ---------- 14
ఐపిసి వార్తలు ---------- 16
ద్వితీయ ఖలీఫా ఉమర్ (ర) ---------- 17
లజ్జ ---------- 18
నేటి బాలలే రేపటి పౌరులు ---------- 19
నెలవంక ఉత్తరాలు ---------- 20

దైవ ప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "మూడు విశేష గుణాలు ఏ వ్యక్తిలోనైతే ఉంటాయో అల్లాహ్ ఆ వ్యక్తితో తేలికపాటి లెక్క తీసుకుంటాడు. 'ఆ మూడు గుణాలేమిటి?' అని సహచరులు ప్రశ్నించగా -



"1) నీ హక్కును నీకివ్వకుండా కాజేసిన వారికి నవ్వు ఇవ్వాలి.
2) నీతో తెగతెంపులు చేసుకున్న వారిని నీవు కలుపుకుని వెళ్ళాలి.
3) నీపై దౌర్జన్యం చేసిన వ్యక్తిని నీవు మన్నించాలి" అని సమాధానమిచ్చారు.

كلمة العدد ◀ اقتربت الساعة ◀ هذه هي الحياة ◀ جوامع الكلم ◀ اختبر معلوماتك ◀ آيات الله في الكون ◀ إسماعيل عليه السلام ◀ الحكمة في السنة ◀ خذ عقيدتك من الكتاب والسنة ◀ نشيد (من الهند) ◀ القرآن نور وبرهان ◀ أخبار اللجنة ◀ سيدنا عمر رضي الله عنه ◀ الحياء ◀ روضة الأطفال ◀ رسائل الهلال

దృక్పథం

దటీజ్ పొలిటిక్స్!

నేటికి దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం లిబియాలో అధికారాన్ని హస్తగతం చేసుకున్న ఖదాఫీ ఏలుబడి నిరంకుశత్వానికి, జన కంటక పాలనకు నిలువుటద్దం అనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే దౌత్య మార్గంలో ఖదాఫీని దారికి తెచ్చి, దేశంలో శాంతిని నెలకోల్పే ప్రయత్నానికి తగినంత అవకాశమూ, వ్యవధీ ఇవ్వకుండా భద్రతా మండలితో హడావుడిగా తీర్మానం చేయించి, వెంటనే సైనిక చర్యలకు పూనుకోవడంలో పాశ్చాత్య దేశాల తీరే అనుమానాస్పదం. ఈజిప్టు, యమన్ బహ్రైన్ తదితర దేశాలలో తలెత్తిన తిరుగుబాటు విషయంలో ఇంత సత్వర, విపరీత స్పందనను అవి కనబర్చకపోవడం వాటి కుటిల నీతికి, ద్వంద్వ ప్రమాణాలకు నిలువెత్తు నిదర్శనం. ముస్లిం పాశ్చాత్య ప్రపపంచం మధ్యనున్న చారిత్రక, సాంస్కృతిక అగాధాన్ని పూడ్చి, రెండింటి మధ్య వినూత్నమైన స్నేహ వారధిని నిర్మిస్తానని హామీ ఇచ్చిన నోబెల్ శాంతి పురస్కార గ్రహీత అమెరికా అధ్యక్షుడు ఒబామా ఇలా రీగన్, జార్జీ బుష్‌ల యుద్ధోన్మాదానికి అసలు సిసలు వారసునిగా చరిత్ర కెక్కాలనుకోవడం మిక్కిలి విచారకరం.

నిన్నమొన్న విషయమే – విధ్వంసక మారణాయుధాలు ఉన్నాయన్న, ఉగ్రవాద శక్తులకు అండదండలందిస్తున్నారన్న రెండు పచ్చి అబద్ధాలను అడ్డు పెట్టుకుని ఇరాక్ మరియు అఫ్గాన్ మీద దాడి చేసి లక్షలాది మంది అమాయకుల్ని ఊచకోత కోసిన అమెరికాకు ఖదాఫీ రూపంలో చమురు నిల్వలపై పెత్తనం చెలాయించే సువర్ణావకాశం లభించింది. మధ్యప్రాచ్యంలో ప్రజా విప్లవంతో అది కట్టుకున్న కలల సౌధాలన్నీ ఒక్క సారిగా కుప్పకూలుతుంటే, మూలస్థంభంగా ఉన్న ముబారకే మడికట్టుకుని కూర్చుంటే ఏం చేయాలో తోచక దిక్కులు చూస్తున్న దానికి లిబియాలో సిరియాలోపారుతున్న నెత్తుటి కాలువల్లో దారి దొరికింది. అది లిబియాను 'విముక్తి' (?) చేసి మధ్యప్రాచ్యంలో ఉక్కుపాదం మోపితే చాలు. అదే అధిపత్యానికి సుస్థిర పునాది కాగలదన్నది దాని నమ్మకం.ఇదే సమయంలో ఉసామా బిన్ లాడెన్ మరణించాడన్న వార్త రావడం గమనార్హం.

మేక పిల్లలను తినాలన్న తోడేలు కుంటి సాకులు చెప్పినట్లు, లిబియా విషయంలో అగ్రరాజ్యాలు వ్యవహరిస్తున్నాయి. లిబియాను అక్రమించ దలచుకున్న సామ్రాజ్య వాదులు ఇప్పుడు **'మానవతా వాదం'** సాకుతో రంగ ప్రవేశం చేస్తున్నారు. కొన్ని నెలల క్రితం వరకు లిబియాను, దాని అధినేత ఖదాఫీని మచ్చలేని చంద్రుడు అని నీతిచంద్రిక వల్లించిన బడా బాబులే ఇప్పుడు తనకేం తెలియదన్నట్లు మాట్లాడుతున్నారు. ఖదాఫీ పాలనంతా సవ్యంగా ఉందని ఎవ్వరూ చెప్పరు. అలాగే ప్రజా ఉద్యమాన్ని ఉక్కు పాదాలతో అణచివేసేందుకు పూనుకోవడం ఖదాఫీ చేసిన నేరం అనడంలోనూ ఎవరికిఎలాంటి అభ్యంతరం లేదు. లిబియా విషయంలో ఇంత చొరవ కనబరుస్తున్న ధనిక దేశాలు బహ్రైన్ పాలకులు నిరాయుధులపై కాల్పులు జరిపి అనేక మందిని బలిగొనడాన్ని, యమన్‌లో వందలాది మందిని చంపడాన్ని చూస్తూ కూడా ఐరోపా దేశాలు ఎందుకు మౌనంగా ఉన్నట్లు? అరబ్బు ప్రజాస్వామిక ఆకాంక్షలను గౌరవించాల్సిందేనని, ప్రజాస్వామిక ఉద్యమాలకు మద్దతు పలకాల్సిందేనని 3 నెలల క్రితమే గర్జించిన ఒబామా గొంతులో వెలక్కాయ అడ్డుపడిందా? ఫాలస్తీనా పౌరులను అష్టదిగ్బంధం చేసి వారిని పని చేసుకోనివ్వ కుండా, నిత్యావసరాలు వారికి అందకుండా చేస్తున్న ఇజ్రాయిల్ పిశాచం దుర్మార్గం ఒకనాటిది కాదే! ఈ దమన నీతి, దహన కాండ, రుధిర పిపాస రాక్షసత్వం దశాబ్దాలుగా సాగుతున్నా ఈ అపర మానవతా వాదులు స్పందించరేం! ప్రజాస్వామ్యమే ప్రధానమైతే వాటి కనుసన్నలలో ఉండే రాజ్యాల సంగతేంటి? ఇక లిబియాపై దాడి వెనక కారణాలను అన్వేషిస్తే, 2009 నాటి అంచనా ప్రకారం 10, 320 కోట్ల టన్నుల చమురు నిక్షేపాలు అక్కడున్నాయి. అంటే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న చమురు నిల్వల్లో 55. 6 శాతం లిబియాలో ఉంది. దీనికితోడు ఎడారి గర్భంలో శిలాజోదకాల సముద్రం దాగి ఉంది. చమురుకన్నా ఈ శిలాజోదకాలే ఎక్కువ లాభాలను తీసుకు వస్తాయి. అలాగే ఈ ప్రాంతంలో సామ్రాజ్య వాదులకు భౌగోళిక రాజకీయ ప్రయోజనాలు సయితం మెండుగానే ఉన్నాయి.

పోతే, ప్రజా విప్లవాలతో ఎప్పుడూ ఉండే చిక్కే ఇప్పుడూ ఉంది. విప్లవ పక్షమైనా, వ్యతిరేక పక్షమైనా ఏం చేయాలో సావకాశంగా ఆలోచించే లోపే అవకాశాలు చేజారిపోతాయి. అరబ్బు విప్లవంతో ప్రజలు ఒక కొత్త చరిత్రకు నాంది పలుకుతారన్న మాట నిజమే కావచ్చు. కానీ, అరబ్బు విప్లవాలు తిరగరాస్తున్న భవితవ్యాన్ని తిరిగి మళ్ళీ తన హస్తగతం చేసుకునే అవకాశాలను వెదుక్కుంటున్నాయి ధనిక దేశాలు. ఇక్కడ గమనించా ల్సిన విషయం ఒకటుంది. భద్రతా మండలి, ఐరాస – ఇవన్నీ కీలు బొమ్మలు. ఎందుకంటే ఫాలస్తీనాకు ద్రోహం చేసి ఇజ్రాయిల్‌ను ఏర్పాటు చేయడం ఒక చారిత్రక నేరం అయితే, ఐరాస కేటాయించిన భూభాగానికి రెట్టింపును ఇజ్రాయిల్ అక్రమించుకున్నా తప్పు పట్టకపోవడం మరో పెద్ద నేరం.

ప్రజలు సర్వస్వతంత్రులయినట్లయితే, తన సార్వభౌమిక దేశంలో తమ భవిష్యత్తును నిర్ణయించుకునే అవకాశం ఆయా దేశ ప్రజలకు ఇవ్వాలి. సైనిక జోక్యాన్ని విరమించుకునేలా సామ్రాజ్యవాదులపై ఒత్తిడి తేవాలి. భారత్‌తో సహా ఐరాస, భద్రతా మండలి సమావేశానికి హాజరు కాని దేశాలన్నీ కలసి పచ్చిమాసియాలో సాగుతున్న మరో సైనిక దురాక్రమణను అడ్డుకోవాలి. లేదంటే భవిష్యత్తులో తీవ్ర పరిణామాల్ని చవి చూడాల్సి వస్తుందన్నది మాత్రం నిజం.

అబ్దుస్సలాం

telgo.indd 4 5/3/11 1:25 PM

మౌలానా వహీదుద్దీన్ ఖాన్

లెక్కల ఘడియ సమీపిస్తోంది..!



మృత్యువు ఆసన్నమైన వేళ...!

మీరు మీ రెండు కళ్ళను ఒకసారి మూసుకోండి. ప్రపంచమంతా మీకు చీకటిగా ఉంటుంది. సూర్యరశ్మి నుండి ఆకాశ అంచుల వరకు, పచ్చని పొలాల నుండి అందమైన నగరాల వరకూ – అన్నీ చీకటిలో దాక్కుంటాయి. అన్నీ ఉండి కూడా మీ ముందు లేనట్లే ఉన్నాయి.

పరలోకపు దృష్టాంతం కూడా ఇంచు మించు ఇటువంటిదే. పర లోకం అనేది కేవలం సత్యం మాత్రమే కాదు; అన్నింటి కన్నా గొప్ప సత్యం. కాని అది మన కంటికి కనిపించదు. ఎందుకంటే అది మన నుండి అగోచరంగా ఉంది. దాని విషయంలో మన కళ్ళు మూయబడి ఉన్నాయి. మృత్యువు వచ్చిన మరుక్షణమే ఆ అగోచర తెర తొలిగిపో తుంది. నేడు ఇక్కడ కళ్ళు మూసుకున్న ఒక వ్యక్తి కళ్ళు తెరచి లోకాన్ని ఎలా చూస్తాడో అలాగే మరణ ఘడియ వచ్చిన (చనిపోయిన) మరు క్షణమే మనిషి పరలోకాన్ని వీక్షిస్తాడు. ఒక వ్యక్తి కళ్ళకు గంతలు కట్టి అతన్ని ఒక పెద్ద పులి ముందు నిలబెట్టి చూడండి –అతనెక్కడ నిలబడి ఉన్నాడో అతనికి తెలియదు. అదే స్థితిలో అమాంతం కళ్ళకున్న గంతల్ని తీసివేయండి– తన ముందున్న దృశ్యాన్ని చూసి అతనెంతగా హడలెత్తిపోతాడో అంతకన్నా ఎక్కువగా మరణానంతరం కొత్త లోకాన్ని – పరలోకాన్ని – వీక్షించే వ్యక్తి భయ కంపితుడవుతాడు.

ఇహలోకంలో ఎంతో మంది ఆసరాలతో, అండదండలతో మనుగడ సాగించిన ఆ వ్యక్తి **'అక్కడ'** తనను నిరాశ్రయునిగా, ఒంటరివానిగా చూస్తాడు. ఇక్కడ అనునిత్యం తనతో ఆడుతూ పాడుతూ తిరిగే స్నేహి తులు అక్కడ అతనికి తోడుగా ఉండరు. ఏ భార్యాపిల్లలనయితే తన వారని వారి కోసం సర్వస్వం అర్పించాడో ఆ భార్యాపిల్లలు అక్కడ పరాయివారయి ఉంటారు. తన ఏ భౌతిక శక్తులను ఇంత కాలం నమ్ముకుంటూ ఉండేవాడో అవన్నీ అక్కడ సాలేగూడుకన్నా బలహీ నంగా, పనికిమాలినవిగా గోచరిస్తాయి. ఏ హితవులనయితే తాను ఇహలోకంలో పసలేనివని తేలిగ్గా కొట్టి పారేశాడో, వాటి పట్ల నిర్లక్ష్యం వహించాడో అవే అక్కడ బలమైనవిగా, దృఢమైనవిగా, సత్యమైనవిగా ప్రతక్ష్యమవుతాయి.

ప్రళయం

ప్రతి రోజు రేయి తరువాత పగలు వస్తుంది. రాత్రి పూట చీకటిలో దాగివున్న వస్తువులు పగటి వెలుగుల స్పష్టంగా కన్పి స్తాయి. ఇలాగే ఈ లోకం తరువాత మరో లోకం – పరలోకం వస్తుంది. ఆ సమయంలో యదార్థాలన్ని పగటి వెలుగులా బహి ర్గతమవుతాయి. నేడు ఒకడు తనలోని చెడును కృత్రిమ అంద మైన ముసుగుతో కనబడకుండా దాచుకుంటున్నాడు. మరొకడు తనకు నేర్పిన విద్యతో, అందమైన పదాలతో తన మిథ్యావాదాన్ని సత్యంగా ప్రకటించుకుంటున్నాడు. ఇంకొకడు తన బాహ్య సౌంద ర్యాన్ని సాధనంగా వాడుకుంటున్నాడు. తన అంతరాత్మ ఘోషను అణచి పెట్టేందుకు శతవిధాల ప్రయత్నిస్తున్నాడు. మరో మాటలో చెప్పాలంటే ప్రతి మనిషికి సంబంధించిన ఈ వాస్తవంపై 'రేచీ కటి' అనే ముసుగు పడి ఉంది. అయితే ప్రళయ దినం ఇలాంటి ముసుగులన్నింటినీ పటాపంచలు చేసి వేస్తుంది. ఉదయ కాంతి లా అది అన్ని వస్తువులను వాటి నిజ రూపంలో చూపెడుతుంది. యదార్థాలపై పడి ఉన్న ముసుగు తొలగించబడే ఆ సమయం ఎంత విచిత్రమైనదంటే, ఆ రోజు మనిషి తాను నిలబడవలసిన చోటే నిలబెట్టబడి ఉంటాడు. నేడు అతను ఇహంలో తన కోసం కల్పించుకున్న కృత్రిమ ఆర్భాటాలు అక్కడ లభ్యమవ్వవు.

ఈనాడు ఇక్కడ అధికారులమని, సార్వభౌమాధికారులమని విర్ర వీగుతున్న ఎందరెందరికో ఆనాడు కడు నిస్సహాయ స్థితి దాపురిస్తుంది. నేడు ధర్మాసనాలపై ఆసీనులై ఉన్న ఎందరో న్యాయ శాస్త్ర కోవిదులు ఆ రోజు నేరస్తుల బోనులో నిలబడి ఉంటారు. **'ప్రముఖ వ్యక్తులుగా'** నేడు పలువురి మన్ననలందుకు టున్న ఎందరో ఆ రోజ పురుగులు, చీమల్లా అల్పులై ప్రజల పాదాల క్రింద నలుగుతూ ఉంటారు. ప్రతి ప్రశ్నకు తిరుగులేని జావాబులు ఇచ్చే ఎందరో మేధావులు ఆ రోజు నోరు పెగలక, పదాలు అందక నీళ్ళు నములుతూ నిలబడి ఉంటారు. ఆ రోజు సఫలీకృతులు ఎవరు? స్వర్గంలో వెళ్ళే సౌభాగ్యవంతులు ఎవరు?

స్వర్గం ఎవరి కోసం

ఎల్లరి ఔన్నత్యాన్ని కాదని కేవలం దేవుని ఔన్నత్యాన్ని, దేవుని గొప్పదనాన్ని అంగీకరించినవాని కొరకే స్వర్గం. తన హృదయం లో ఇతరుల ప్రేమకన్నా దైవ ప్రేమకే అగ్రతాంబూలం ఇచ్చేవాని కోసం స్వర్గం. స్వర్గం న్యాయశీలుర నివాస స్థలం మాత్రమేగానీ, అధర్మపరుల స్థలం కాదు. స్వర్గం సంయమనం పాటించేవారిదే గానీ, తలబిరుసుల నిలయం కాదు. స్వర్గం ఎదుటి వారి ధన, తన, మానాలను గౌరవించేవారి సదనమేగానీ, ప్రజాహక్కులను కొల్లగొట్టే కుత్సత మనస్కులది కాదు. స్వర్గం కేవలం అల్లాహ్‌ను ఆరాధించిన వారి కాలనీయేగానీ, కన్పించే ప్రతి కంకర్రాయిని శంకర్‌గా భావించి భజనలు చేసే వారిది కాదు. స్వర్గం దైవనామ స్మరణతో తృప్తి చెందే హృదయం గలవారి నెమ్మది నెలవేగానీ, అసత్యవాదుల, వితండవాదుల గృహమెంత మాత్రం కాదు.

telgo.indd 5 5/3/11 1:25 PM

ఇదీ జీవితం

దాదాపు కోరికలన్నీ సాధారణంగా తీరుతాయి; చావకూడదన్న ఒక్క కోరిక తప్ప అన్నీ. వీటిల్లో ఒకటి ఆకలి. నిద్ర కావాలన్న కోరిక ఎంత తీవ్రంగా ఉంటుందో అంతే బలమైనది ఆహారం కావాలన్న కాంక్ష. ఇది చాలా అరుదుగా తీరే కోరిక. తరచూ ఇది మనిషిని శాసించేదిగా మారుతూ ఉంటుంది. అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (స) వారు ఇలా అన్నారు: **"అకాదుల్ ఫఖ్ర్ అన్ యకూన కుఫ్రన్"** (ఈ హదీసు బలహీనమైనది) **దారిద్ర్యం మనిషిని వ్యతిరేకి (అవిశ్వాసి, నమ్మక ద్రోహి, నేరస్థుని)గా మార్చివేసే ప్రమాదముంది.** ఇక మనిషి ఆకలిని తమాగియించుకున్నా తన గొప్పతనాన్ని అందరూ గుర్తించాలన్న అతని కోరిక మాత్రం తీరదు. ఇదీ ఒక రకమైన ఆకలే. ఇది మనుషుల్ని ఎప్పటికీ వదలదు. ఈ ఆకలిని తృప్తి పర్చుకోగల వ్యక్తి మటుకు చాలా అరుదు. తన గొప్పతనాన్ని అందరూ గుర్తించాలన్న కోరిక ఒక్క మనుషులకే ఉంటుంది. మనిషికీ జంతువుకీ మధ్య గల ముఖ్యమైన తేడాల్లో ఇది కూడా ఒకటి. పై రెండు కోర్కెలను తీర్చుకోవడానికే మనిషి పల్లె నుండి పట్టణానికి, ఒక రాష్ట్రం నుండి మరో రాష్ట్రానికి, ఒక దేశం నుండి మరో దేశానికి ప్రయాణం చేస్తుంటాడు. ఈ జాబితాలో గల్ఫ్ దేశాల్లో ఉన్న మనం కూడా ఉన్నామన్నది గమనార్హం. గల్ఫ్ దేశాలకు, ఫారిన్ కంట్రీస్‌కు వెళితే సమస్యలు తీరతాయని, జీవితాలు మెరుగవుతాయని మనలాంటి ఎందరో స్వదేశాన్ని వదిలి విదేశాల్లో జీవిస్తున్నారు. మనలాగే వీరికి సయితం జీవితంలో మధురానుభూతులెన్నో ఎండమావులవుతున్నాయన్న ధ్యాస లేదు. ఇల్లు, ఇల్లాలు, పిల్లలు, తల్లిదండ్రులు, బంధుమిత్రుల ప్రేమలు, అభిమానాలు, ఆప్యాయతలు, అనురాగాలు... అన్నీ ఒకవైపు..... ఆర్థిక సమస్యలు, బాధ్యతలు మరో వైపు తూకం రాళ్ళలా ఊగుతూ ఉంటే ఎవరైనా ఏం చేస్తారు? అందుకే మనసు, మమతలకన్నా కడుపే కైలాసం అయింది. మనమిక్కడ... ప్రాణాలన్నీ మనపైనే నిలుపుకుని నిస్తేజంగా బ్రతుకు వెళ్ళమార్చేవారు అక్కడ...! మనలాంటి కొందరి జీవితగాధయే ఈ వ్యాసం!! అందరూ కళ్ళు తెరవాలన్నదే దీని ముఖ్యోద్దేశ్యం!!! **- ఉదయ భాను**

పెళ్ళయి ఏడాది కూడా కాలేదు. తీసుకున్న కట్నం చాలదంటూ కట్టుకున్నవాడు కువైట్‌కు పంపాడు. 10 సంవత్సరాలుగా అదే పని. బట్టలు ఉతుకుతూ, వంటలు చేస్తూ, ఇళ్లు ఊడ్చుతూ కాలం వెల్లడీస్తోంది ఓ మహిళ. ఆమె కాపురం అందరిలా ఆనందాల హరివిల్లు కాదు. సంతోషం ఆమె జీవితంలో పట్టుమని పన్నెండు నెలలే. ఆమె ముఖంలో ఏదో తెలియని నిరాశ. కుటుంబంతో గడిపే సాధారణ గృహిణి ముఖంలో కనబడే సంతృప్తి ఆమె ముఖంలో మచ్చుకైనా కనబడదు. ఎలా కన్పిస్తుంది? **'ఉన్నానంటే, ఉన్నాను. తిన్నానంటే తిన్నాను'** అన్నట్టు భర్తతో మనసు విప్పి మాట్లాడిన సందర్భాలు అరుదు. బాధేస్తే అక్కున చేర్చుకుని ఓదార్చే అమ్మ కూడా ఎక్కడో దూరాన ఉంది. చుట్టూ ఉన్నది మనుషులే అయినా ఒంటరితనం ఆమెను మరింత కృంగదీస్తోంది.

ఇది సరిపోదన్నట్లు నెలనెలా డబ్బు పంపించమని భర్త ఒత్తిడి. ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి. **'నేను ఇక్కడ ఉండలేనండి; వచ్చేస్తానండి'** అని చెప్పినప్పుడల్లా బండ బూతులు వినాల్సి వచ్చేది. చూస్తూ చూస్తూ ఇద్దరు పిల్లలు కూడా పుట్టారు. వారి చదువులు, భవిష్యత్తు అంటూ మరో 10 సంవత్సరాలు ఇట్లే దొర్లి పోయాయి. రెండేళ్ళ కోసారి దేశం వెళ్ళినా ఆ నాలుగు రోజులూ హడావుడితోనే సరిపోయేది. కళ్ళుమూసి తెరిచేలోపే తిరిగి వెళ్ళే రోజు దగ్గరికొస్తుంది. ఉబికి వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ వెనక్కి చూసే సరికి మళ్ళీ శూన్యం! తడిబారిన నయనాలు!! ఆవిరైపోయిన ఆశలకు దర్పణాలు!!!

కలిసొచ్చిన సంబంధం ఆలస్యం చెయ్యకూడదని 14 ఏండ్ల పాపకు పెళ్ళీడొచ్చిందని కట్టబెట్టారు. భర్త మంచివాడే. రెండు మూడేండ్లు బాగానే గడిచాయి. ముచ్చటగా ముగ్గురు పిల్లలు పుట్టారు. లేని బడాయి కోసం అత్తామామలు చేసిన అప్పు ముప్పయి కూర్చుంది. అంతలో ఎండమావి లాంటి ఉచిత సలహా ఎవరో ఇచ్చారు. దుబాయ్‌లో ఉద్యోగం. వేలల్లో జీతం. అయితే కాస్త ఖర్చుతో కూడుకున్న విషయం అన్నారు. అప్పులవారి బెడద నుండి దూరంగా పారిపోవాలనుకున్నాడో ఏమిటో తెలీదు కాని, దుబాయ్‌కెళ్ళేందుకు మళ్ళీ అప్పు. తన దగ్గరున్న నగలన్నీ అమ్మి భర్త చేతిలో పెట్టింది. భర్త పయనమై దుబాయ్ వెళ్ళిపోయాడు. అచ్చటా ముచ్చటా తీరకముందే విరహావేదనా నిప్పుల్లో నెట్టేసి మరీ వెళ్లాడు. మెట్టింటి నుండి పుట్టింకి వెళ్ళాలన్నా అత్త ఒప్పుకునేది కాదు. భర్త అక్కాచెల్లెళ్ళ హింసాత్మక చేష్టలు, మరిది హెరాస్మెంట్‌లు అధికమయ్యాయి. జీవితంలో చెప్పలేని నైరాశ్యం. ఎప్పుడన్నా భర్త నుండి ఫోన్ కాల్ వస్తే బీడువారిన భూమిపై తొలికరిజల్లు తాలూకు పులకరింతే ఆమె మనోసీమలో కలిగేది. ఈలోగా పిల్లలు లాక్కుని **'నాన్నా! నువ్వెప్పుడొస్తావు?'** అంటూ ఆర్తిగా అడుగుతారు. దానికి సమాధానం అతని దగ్గర లేదు. కుప్పలు తెప్పలుగా అప్పులు, ఏవేవో

telgo.indd 6 5/3/11 1:25 PM

ఖర్చులు అతన్ని వెనక్కి లాగుతున్నాయి. ఆమె మనోవేదన పెరుగుతూనే ఉంది.... మాట సయితం కరువైన ఆమెకి 30 దాటేస్తుంది.

పెళ్లయిన కొన్నాళ్ళకే భర్త దుబాయ్‌కు పయనమైపోతే, ఆమె కష్టాన్నే నమ్ముకుంది. నాలుగేళ్ళకోసారి వచ్చివెళ్ళే భర్త. అత్త మాటల తూటాలు. మరో వైపు ముగ్గురు పిల్లల్ని పెంచుకుంటూ బ్రతుకుని బరువుగా నెట్టుకొచ్చింది. చుట్టూప్రక్కల వారితో, బంధుమిత్రులతో జాగ్రత్తగా మెలిగేది. తన చేతికందే ప్రతి పైసాను భద్రపర్చేది. కోడి తన పిల్లల్ని రెక్కల క్రింద దాచుకున్నట్లు తన సంతానాన్ని కాపాడుకుంటూ వచ్చింది. తన సరదాలన్నింటినీ ప్రక్కనబెట్టి పిల్లల అచ్చటా ముచ్చటా తీర్చింది. ఎవరి జోలికి పోతే ఏమవుతుందోనని బిక్కుబిక్కుంటూ బ్రతికింది. అసలు ఏ మాట పడాల్సివస్తుందోనని ముస్తాబులకు కూడా దూరమయింది. పిల్లలు ఎదిగి వచ్చారు. ఇటు అత్త పెట్టే హింసలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఇన్నేళ్ళు ఎంతో ఓర్పుగా గడిపిన ఆమె సహనం చచ్చింది. భర్తకు ఫోన్ చేసి ఫినిష్ చేసుకొని వచ్చే యవలసిందిగా ప్రాధేయపడింది. భర్త నచ్చ జెప్పేందుకు ప్రయత్నించాడు. **'మీరు లేకుండా నేను బ్రతకలేను, చచ్చిపోతాను'** అని తెగేసి చెప్పింది. కోపంతో భర్త **'సరే అలానే చెయ్యి'** అని మాట వరసకే అన్నాడు. మరో మూడు గంటలు గడిచాయి...! ఆమె...!! శ...! వ...!! మై...!! తేలింది. ఒంటికి నిప్పంటించుకుని మరణించిందన్న వార్త వినగానే భార్యను ఎంతగానో ప్రేమించే భర్తపై పిడుగు పడ్డట్లయింది. షాక్‌కు లోనైన భర్త ఇప్పటికీ కోలుకోలేని స్థితిలో ఉన్నాడు. **'నా కారణంగానే నా భార్య మరణించిందని, దైవం నన్ను నిలదీస్తే నేనేం చెయ్యాలని'** తనలో తానే మాట్లాడుకుంటూ రోడ్ల మీద పడి తిరుగుతున్నాడు....! అంటే అతను పిచ్చోడయ్యాడు!!

అడవి సమీపంలో గల కుగ్రామం ఆ అమ్మాయిది. నలుగురు పిల్లల్ని కని ఆమె తల్లి కన్ను మూసింది. బాగా బ్రతికిన కుటుంబం. అమ్మ మరణానంతరం నాన్న తాగుడికి బానిసయ్యాడు. దానికితోడు ఇతర వ్యసనాలు కూడా జతయ్యాయి. సంపాదించింది ఆయన వ్యసనాలకే సరిపోయేది కాదు. బరువుబాధ్యతలు మరచిన అతనికి తన పెద్ద కుమార్తెను సవూదీ పంపాలన్న ఆలోచన పుట్టింది. ఎస్కేపిస్టుగా మారి, తను మోయాల్సిన బాధ్యతలను అల్లారుముద్దుగా పెరగాల్సిన అమ్మాయి మీద నెట్టేసి చేతులు దులుపుకున్నాడు. అక్కడ ఆమెకు అదృష్టంకొద్దీ మంచివారే యజమానులుగా దొరికారు. వారు తమ సొంత కూతురిలా చూసుకునేవారు. తద్వారా ఆమెకి కాస్త ఊరట కలిగింది. కుటుంబం, బరవు, బాధ్యత అంటూ 5 ఏండ్లు గడచిపోయాయి. నెలనెలా కూతురు పంపే డబ్బుతో తండ్రి తాగుడు రెట్టింపయ్యింది. చివరికి అదే ఆయన ప్రాణాల్ని బలిగొంది. ఇంటికి పెద్ద కూతురు గనక బాధ్యత మరింత పెరిగింది. ఇద్దరు తమ్ముళ్లు, ఒక చెల్లి. వారి భవిత కోసం తాను కొన్నొత్తయి కరిగి వారికి వెలుగునివ్వసాగింది. వారి సంతోషంలోనే తన సంతోషాన్ని వెతుక్కుంది. వైవాహిక జీవితానికి దూరంగానే బ్రతికింది. తమ్ముళ్లు, చెల్లికి ఉన్నత విద్యలు చదివించి, మంచి సంబంధం చూసి పెళ్ళిళ్ళు కూడా జరిపించింది.

అప్పటి వరకూ అక్కతో బాగానే మసలుకున్న ఆ ముగ్గురు ఎవరి స్వార్థానికి వారు ఆవిడను ఉపయోగించుకోవడం ప్రారంభించారు. స్వదేశానికి వచ్చినప్పుడల్లా ఆవిడ వెన్నంటే ఉంటూ ఆమెను ఎంతగానో ప్రేమిస్తున్నట్లు నటించేవారు. తమ్ముళ్ళు, చెల్లే సర్వస్వం అనుకుని బ్రతుకుతున్న ఆమెకి ఇవేమీ తెలియవు.

ఇప్పుడు ఆమెకి 55 ఏండ్లు. పని చేసే ఓపిక కూడా ఆమెకి లేదు. కారణం కొన్నాళ్ళ క్రితమే శరీరంలోని రక్తమంతా చెడిపోయిందని డాక్టర్లు చెప్పారు. తీరా తెలిసిందేమిటంటే బ్లడ్ క్యాన్సర్...! అని. ఎన్నోసార్లు రక్త మార్పిడి చేయించారు యజమానులు. అయినా ఫలితం లేకుండా పోయింది. ఇక జరిగే పని కాదు, స్వదేశానికి తిరిగి వెళ్ళిపోమని యజమానులు అన్నారు. బాగానే ఇచ్చి పంపారు కూడా. ఆమె దగ్గర ఉన్న డబ్బుని లాక్కునేంత వరకూ అందరూ ఆమె వెంటనే ఉన్నారు. తర్వాత ఎవరి దారిన వారు వెళ్ళిపోయారు. అప్పుడు తెలిసిందావిడకి తన పేరు మీద ఏ ఆస్తీ లేదని! అంతా వారు కాజేసుకున్నారని!! ఇన్నాళ్ళు వారు కురిపించిన ప్రేమ ఒట్టి బూటకమని!!! మరుక్షణం ఆమె కట్టుకున్న కలల సౌధాలు ఒక్క సారిగా కుప్పకూలాయి!!!!

అల్లులవాలి చెడవ నుండి దూరంగా పాల పోవాలనుకున్నెడో ఏమిటో తెలీదు కాని, దుబాయ్‌కెళ్ళేందుకు మళ్ళీ అప్పు తన దగ్గరున్న నగలన్నీ అమ్మి భర్త చేతిలో పెట్టింది. భర్త ఏయనమై దుబాయ్ వెళ్ళిపోయాడు. అచ్చటా ముచ్చటా తీరకముందే ఏరతోవేదనా నిళ్ళల్లో నెట్టేసి మరీ వెళ్లాడు.

ఒకప్పటి ఎంతో తెలివైన, చురుకైన ఆ యువతి తనవారి కోసం త్యాగాలు చేసి మంచం పట్టింది. ఈ రోజు ఆమె ఓ చేదు నిజాన్ని ఎదుర్కొన్నది. అది పైబడిన వయసే కావచ్చు, మహమ్మారి రోగమే కావచ్చు, అయినవారు చేసిన మోసమే కావచ్చు. ఇన్నేళ్ళు ఒంటరిగానే జీవించిన ఆమెకి కళ్ళెదుట ఇంకా ఎన్నో ఏళ్ళ జీవితం కనిపించింది. కానీ ఎదురు చూడటానికి ఏమీ మిగలలేదు; ఒక్క చావు తప్ప.

ఇలాంటి అతివలు ఏదో ఒక్క జిల్లాలోనే కాదు ప్రతి జిల్లాలోనూ కనపడతారు. ప్రతి గ్రామంలోనూ ఉంటారు. ఆ మాట కొస్తే పూర్తి దేశంలో ఇలాంటి వారు ఎందరో ఉన్నారు. అంటే కూటి కొసం... కూలి కోసం... పట్టణాలకు, ఇతర రాష్ట్రాలకు, ఇతర దేశాలకు వలస పోవలసిందేనా?! వారి బ్రతుకుల్లో వసంతానికి నిర్వచనం ఎండమావేనా? ఈ చీకటి బ్రతుకుల్లో వెలుగు నిండాలంటే, ఈ ఒంటరి జీవితాల్లో సంతోషాలు విరబూయాలంటే, వేదనకి బదులు వారిలో ఆనందం పెల్లుబుకాలంటే, అనురాగం పండాలంటే, ఎడారి అయిన వారి జీవన పయనంలో ఒయాసిస్సు కనబడాలంటే. ... ఏం చేయాలో, ఎలాంటి చర్యలు గైగొనాలో పాఠకుల నిర్ణయానికే వదిలేస్తున్నాను.

telgo.indd 7 5/3/11 1:26 PM

ప్రా పరిమళం



హబీబుర్రహ్మాన్ జామయీ

మేధకు మేత

- ఫజర్, మగ్రిబ్, ఇషా నమాజులను జహ్రీ (బిగ్గరగా పారాయణం చేసే) నమాజులని, జొహర్ అసర్‌లను సిర్రీ (మెల్లగా పారాయణం చేసే) నమాజులంటారు.
- ఉమర్ బిన్ ఖత్తాబ్ (ర)ను హత్య చేసింది అబూ లూలూ ఫీరోజ్ మజూసీ, పారశీయుడు.
- ఖురైషుల ప్రధాన వృత్తి వ్యాపారం. ఎడాదిలో రెండు సార్లు ప్రయాణం చేసేవారు.(1) శీతాకాలంలో యమన్ దేశానికి. (2) వేసవి కాలంలో సిరియా (అబిసీనియా)కు.
- ఇస్లాంలో మొట్టమొదటి సారి పోస్టాఫీసుని నిర్మించింది ముఆవియ బిన్ అబూ సుఫ్‌యాన్ (ర)
- దైవప్రవక్త (స) వారి కొన్ని గుర్రాల పేర్లు- 'అస్సకబ్, అల్ ముర్తజిజ్, లజ్జాజ్, అల్లహీఫ్, అత్తరబ్'.
- హిజ్రత్ అనంతరం మదీనాలో జన్మించిన మొదటి శిశువు 'అబ్దుల్లా బిన్ జుబైర్ (ర)'.
- దైవప్రవక్త (స) యొక్క చివరి సతీమణి " మైమూన బిన్తె హారిస్" (ర).
- ఈసా (అ) మాట్లాడిన భాష "ఆరామిక్"భాష
- అమీరుల్ మోమినీన్ అనే బిరుదు తొలిసారి ఉమర్ బిన్ ఖత్తాబ్(ర)కు ఇవ్వబడింది.
- దైవప్రవక్త(స)పిన తండ్రి అబుతాలిబ్ దైవదౌత్యపు పదవ సంవత్సరములో మరణించారు.
- దైవదౌత్యం ప్రసాదించబడిన తరువాత మొట్టమొదట నిర్మించబడిన మస్జిద్; మస్జిదె ఖుబా

మాటల ముత్యాలు

- సద్గుణం, సత్ప్రవర్తనకు మరో పేరే సదాచరణ. (ముస్లిం)
- ఏ పని పట్ల మనసులో శంక కలుగుతుందో, మరి దేని గురించి ప్రజలు తెలుసుకోవటం ఇష్టముండదో అది దురాచరణ. (ముస్లిం)
- మీలో ఎవరూ నిలబడి నీళ్ళు త్రాగరాదు. (ముస్లిం)
- ఎవరయితే తన ఉపాధిలో సమృద్ధి, విస్తృతి ఒసగబడాలనీ మరియు దీర్ఘాయుషు ప్రాప్తించాలని కోరుకుంటారో వారు బంధుత్వ సంబంధాలను పెంపొందించాలి.(బుఖారీ)
- తల్లిదండ్రుల ప్రసన్నతతో దైవప్రసన్నత ఇమిడి ఉంది. తల్లిదండ్రుల అప్రసన్నత దేవుని అప్రసన్నతకు మూలమవుతుంది. (తిర్మిజీ)
- మేలుతో కూడుకున్న ప్రతి మంచి పనీ పుణ్యకార్యమే.

మంచిమాటలు

- పరాయివాళ్ళ అద్దాల మేడల్లో నివసించడంకన్నా సొంత గుడిసెలో ఉండడం మిన్న. **(జవహర్‌లాల్ నెహ్రూ)**
- బహిరంగంగా కనిపించే మురికి గుంటల కన్నా మనో మాలిన్యం గల వ్యక్తుల వల్లే జాతికి ఎక్కువ ప్రమాదం. **(రాధా కృష్ణన్)**
- ముప్పై ఏళ్ళ వృద్ధాప్యం కన్నా-డెబ్భై ఏళ్ళ యవ్వనం ఎక్కువ ఆనందాన్నిస్తుంది. **(ఫ్రాస్ట్)**
- ప్రతి రోజూ తలారా స్నానం చేసి, రోజుకి ఆరు గ్లాసులు నీళ్ళు తాగి అరగంట -సేపు వ్యాయామం చేస్తే ఈ ప్రపంచంలోని సగం మంది డాక్టర్లు తమ వృత్తి మానుకోవలసి వుంటుంది. **(న్యూటన్)**
- ప్రేమ గుడ్డిది కాదు. అది చాలా ఎక్కువ చూస్తుంది. అందుకే తక్కువ చూడాలనుకుంటుంది. **(జ్యూలియస్ బోర్టన్)**
- అధికారంలో ఉన్నవారికి చదవడానికి తీరిక ఉండదు; అయితే చదవడానికి తీరిక లేని వారు అధికారానికి అనర్హులు. (ఆస్కార్‌వైల్ట్)
- ఆత్మ విశ్వాసం లేకపోవడమే మన అపజయాలన్నింటికీ ప్రధాన కారణం.(సి.బావే)
- ఇచ్చింది మరచిపోవడం, పుచ్చుకున్నది జ్ఞాపకముంచుకోవడం స్నేహం. (గాంధీ)
- కఠినంగా ఉన్నదాన్ని సరళంగానూ, సరళంగా ఉన్నదాన్ని అలవాటుగానూ, అలవాటుగా ఉన్నదాన్ని ఆహ్లాదంగాను తయారు చేసుకో. (కె.స్టాన్ స్లావిస్కి)
- కసరత్తు శరీరానికి పటుత్వం కలిగిస్తుంది, చదవడం మేధను పదును పెడుతుంది. (ఆర్ స్టీలీ)

ఆశించకండి



- దౌర్జన్యపరునితో - న్యాయం.
- అసూయపరునితో - కృతజ్ఞత.
- చాడీలు చెప్పేవానితో - సత్యం.

మూడు విషయాలు మూర్ఖుడే చేయగలడు



1- స్త్రీలతో రహస్యం చెప్పి నమ్మటం.
2- అనుభవం కోసం విషం త్రాగటం.
- రాజుతో సావాసం (సొహ్‌బతుస్సుల్తాన్)

telgo.indd 8 5/3/11 1:26 PM

ముహమ్మద్ సలీమ్ జామయీ



హృది అదే మనిషి వారిధి, వారధి

"భూమ్యాకాశాల సైన్యాలన్నీ అల్లాహ్ అధీనంలోనే ఉన్నాయి". (ఫతహ్: 4)

ఈ ఆయతు నేపథ్యంలో హజ్రత్ అలీ (ర) గారిని ఇలా ప్రశ్నించడం జరిగింది– 'అల్లాహ్ సైన్యాల్లోని గొప్ప సైన్యం ఏది?' అని. అందుకు ఆయన(ర) ఇలా సమాధానమిచ్చారు:

"నేను (పంచ భూతాల్లోని) లోహాన్ని చూశాను. దాన్ని గొప్ప దైవ సైన్యంగా తలిచాను. ఆ తరువాత నిప్పు వైపు దృష్టి సారించాను. అది లోహాన్ని కరిగిండాన్ని గమనించి నిప్పు గొప్ప దైవ సైన్యం అను కున్నాను. ఆ పిదప నీటిని చూశాను; అది నిప్పును ఆర్పివేస్తూ ఉంది. అది చూసిన నేను నీరును గొప్ప సైన్యంగా భావించాను. ఆ దరిమిలా మేఘాలను చూశాను. అవి తమలో నీరుని మోసుకెళ్ళడం వీక్షించాను. మేఘాలు గొప్ప దైవ సైన్యం అనుకున్నాను. అంతలోనే గాలిని చూశాను. అది దైవం తలచిన చోటుకి మేఘాలను తోలుకెళ్ళ డం కనబడింది. గాలి గొప్ప దైవ సైన్యం అనుకున్నాను. ఆ దరిమిలా పర్వతాల్ని చూశాను. అవి గాలిని ధీటుగా ఎదర్కొవడం గమనించాను. పర్వతాలు గొప్ప దైవ సైన్యం అని తలపోశాను. ఆనక మానవుణ్ణి చూశాను అతను పర్వత శిఖర శిరసెక్కడమే కాక వాటిని పిండి చేసే స్తున్నాడు. అప్పుడు మనిషే గొప్ప దైవ సైన్యం అనుకున్నాను. ఆ పిదప మనిషిని నిస్సహాయుణ్ణి ఏది చేయగలదని ఆలోచించాను. అది ఒక్క నిద్ర వల్ల మాత్రమే సాధ్యం అని గ్రహించాను. నిద్రనే గొప్ప దైవ సైన్యంగా తలిచాను. తర్వాత కంటి మీద కునుకు లేకుండా చేసేది ఏదైనా ఉందా అని పరిశీలించాను. బాధ, దుఃఖం ఆ పని చేయగల దని గ్రహించాను. దాన్నే గొప్ప దైవ సైన్యంగా భావించాను. బాధ మరియు దుఃఖానికి నిలయమేది? అని అన్వేషించాను. దానికి నిల యం మనిషి మనసు అని తెలుసుకున్నాను. మనస్సునే గొప్ప దైవ సైన్యంగా నమ్మాను. ఆ తర్వాత ఈ మనస్సు నెమ్మదించేది ఎలా? అని పశోధించాను. అప్పుడు తెలిసింది నాకు అసలు నిజం. 'మనస్సు కేవలం దైవనామ స్మరణ వల్ల మాత్రమే నెమ్మదిస్తుంది' అని. ఈ యదార్థాన్నే శాంతిప్రదాత అయినా అల్లాహ్ ఖుర్ఆన్‌లో ఇలా పేర్కొన్నాడు. **"విశ్వసించినవారి హృదయాలు అల్లాహ్ స్మరణ ద్వారా తృప్తి చెందుతాయి. గుర్తుంచుకోండి! అల్లాహ్ నామ స్మరణ ద్వారానే హృదయాలు నెమ్మదిస్తాయి".** (రాద్: 28)

ఐహిక అనాసక్తత

పండితాగ్రేసరులైన హసన్ బస్రీ (ర) గారిని కొందరు ఇలా ప్రశ్నించారు: 'మీలో ఐహిక అనాసక్తత పరాకాష్టకు చేరి ఉండటానికి కారణం ఏమిట?' అని. అందుకు ఆయన:

- "నాకు దక్కాల్సిన ఉపాధిని ఎవరూ కాజేయలేరని నాకు తెలుసు గనక నా హృది నెమ్మదించింది.
- నా పనిని నేను తప్ప ఇంకొకరు చేయరని నాకు తెలుసు గనక నేను వాయిదాల వ్యాధికి స్వస్తి పలికి కార్యనిమగ్నతకు ప్రాధాన్యత నిచ్చాను.
- నా స్థితిని, లయను, క్రియను అల్లాహ్ గమనిస్తున్నాడని నాకర్థ మయింది. పాప కృత్యానికి పాల్పడుతూ దైవం నన్ను చూస్తే ఎలా? అన్న ఆలోచన రాగానే నేను సిగ్గుతో నిలువ నీరైపోయాను.
- మృత్యు నా కోసం ఎదురు చూస్తుందని తెలుసుకున్నాను. దానికి తగ్గ సామగ్రిని సమకూర్చుకోవడంలో లీనమయ్యాను". అని తన మాటను పూర్తి చేశారు.

వారి మాట పసిడి మూట

ఇమామ్ షాఫయి (ర) ఇలా అన్నారు:

మూర్ఖుడి మాటకు బదులివ్వకు. అతని మాటకు బదులివ్వడం కన్నా మౌనం మంచిది. ఒకవేళ నువ్వు బదులిచ్చావే అనుకో; అతనికి హాయిని కలిగించినట్లు (తిట్ల తలుపులు తట్టినట్లు). అదే అతని మానాన అతన్ని వదిలేస్తే తన మరణ శాసనాన్ని తానే రచించు కుంటాడు.

హజ్రత్ లుఖ్మాన్ (అ) తన కుమారున్ని ఉద్దేశించి ఇలా హితోపదేశం చేశారు:

బాబూ! నేను అన్ని రకాల మంచి పదార్థాల రుచిని చూశాను. విశ్వాసం, స్వస్థతలకు మించిన మాధుర్యం ఎందులోనూ లేదు.

నేను చేదైనవాటన్నింటి రుచినీ చూశాను. భిక్షమెత్తుకోవడం కన్నా మహా చేదైనది ఏదీ లేదు.

నేను రాళ్ళను, లోహాన్ని మోశాను. రుణ(అప్పు) భారంకంటే బరవైనది ఎదీ లేదు.

మీకు తెలుసా?

- మనిషి మెదడులో ప్రతి గంటి 45 లీటర్ల రక్తం సరఫరా అవుతుంది.
- మనిషి శరీరం పీల్చే ఆక్సీజన్‌లోని క్వాటర్ భాగం ఆక్సిజన్‌ని మెదడు మాత్రమే ఉపయోగించుకుంటుంది.
- ఖుర్ఆన్‌లో పేరుతో సహా ప్రస్తావించబడిన ఏకైక సహాబీ జైద్ బిన్ హారిసా (ర)
- ఖుర్ఆన్‌లో నామాంతరంతో ప్రస్తావించబడిన ఏకైక అవిశ్వాసి అబూ లహబ్

హాయిగా...నవ్వండి..!



సాజిద్: నేను నీలా స్నానం అంటే భయపడేవాడిని ఎక్కడా చూడ లేదురా అన్నాడు.

మాజిద్: నీరు వల్ల నాకు ముప్పుందని డాక్టరు చెప్పాడురా!

సాజిద్: నీరు వల్ల నీకున్న నష్టమేటిరా?

మాజిద్: ఆరోగ్యం రీత్యా నువ్వు ఉక్కు మనిషివని డాక్టర్ అన్నాడురా. ఆయన అంత చెప్పాక కూడా స్నానం చేస్తే నేను తుప్పు పట్టి పోనూ!

telgo.indd 9 5/3/11 1:26 PM

హబీబుర్రహ్మాన్ జామయీ

సృష్టిలో దేవుని నిదర్శనాలు

ఈ సృష్టిలో అనేక రకాలుండడం దేవుని అస్తిత్వం యొక్క పెద్ద నిదర్శనం. జీవులలోనైనా, నిర్జీవులలోనైనా, వృక్ష వర్గంలోనైనా – వీటిలో ప్రతి ఒక్కటి ఒక నిదర్శనం. వృక్ష వర్గాన్నే తీసుకోండి ఒకే భూమి, అదే నీరు, అదే గాలి, ఒకే ఋతువు కాని వేర్వేరు రంగుల, వేర్వేరు రుచుల మొక్కలు, చెట్లు మొలచుచున్నవి. అదే విధంగా రకరకాల జీవులు ప్రతి జీవికి వేరే ఆకారం, రూపం. అంతే కాదు ఒకే జీవికి జన్మించిన పిల్లల రంగు రూపం వేర్వేరు. మనిషి గురించే ఆలోచించండి! వేల సంవత్సరాల నుండి కోట్లాది మంది మానవులు ఒకే తల్లిదండ్రులైన ఆదం – హవ్వాల నుంచి వచ్చినవారైనప్పటికీ వారి రంగులు వేరు, రూపు రేఖలు వేరు. ప్రతి ఒక్కరూ ఇతరులకన్నా భిన్నంగా, విలక్షణంగా కనిపిస్తారు. వారిలో కొందరు తెల్ల వారు, కొందరు నల్లవారు, కొందరిది చామనఛాయ, కొందరు గోధుమ రంగు గల వారున్నారు. అలాగే కొందరు పొట్టి వారు, కొందరు పొడుగరులు. ప్రతి దేశం, ప్రతి ఖండం వారు తమ శరీరాకృతిని బట్టి ఇట్టే తెలుసుకోబడతారు. అంతేకాదు, ఒకే తల్లి బిడ్డలైన ఇద్దరు అన్నదమ్ములు కూడా భిన్నంగా కనిపిస్తారు. ఇదంతా ఆ సృష్టికర్త అపురూప సృష్టకి ప్రబల తార్కాణం. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

"భూమ్యాకాశాల సృష్టి, మీ భాషల్లో, రంగుల్లో ఉన్న వైవిధ్యం కూడా ఆయన (శక్తి) సూచనలలోనివే. జ్ఞాన సంపన్నుల కోసం ఇందులో పలు సూచనలున్నాయి".

(అర్‌రూమ్:22)

విశ్వంలో ఎక్కడ తిరిగినా ఒకేలా ఇద్దరుండరు. ప్రస్తుతం ఫింగర్ ప్రింట్ (వేలి ముద్ర) ముఖ్యమైన గుర్తు . ప్రతి మనిషి యొక్క వేలి ముద్ర అసమానంగా ఉంటుంది. ఇదంతా ఎవరు చేస్తున్నారు?



1880లో వ్యక్తులను గుర్తించడానికి వేలు ముద్రలను తీసుకోవడం శాస్త్రీయ పద్ధతి గా మారింది. ప్రపంచంలో ఎప్పుడూ, ఎక్కడా ఏ ఇద్దరికీ ఒకేలాంటి వేలి ముద్ర ఉండదు. అందువలనే ప్రపంచంలోని పోలీసు యంత్రాంగం నేరస్థుల్ని గుర్తించడానికి వేలి ముద్రలను ఉపయోగిస్తుంది. కాని 14 వందల సంవత్సరాల క్రితమే ఖుర్‌ఆన్‌లో ఫింగర్ ప్రింట్ వేలి ముద్ర గురించి చెప్పడం జరిగింది.

"ఏమిటి, మానవుడు మేమతని ఎముకలను కూర్చలేమని అనుకుంటున్నాడా? తప్పకుండా కూర్చగలము. మేమతని వ్రేళ్ళ కొనలను సయితం (యథాతథంగా) తీర్చి దిద్దగలం".(అల్ ఖియామహ్: 3-4)

ఏ తల్లినైనా అడగండి; తన గర్భంలో ఉండే బిడ్డను తాను పోషిస్తున్నదా ? లేదా ఒక మహత్తరమైన శక్తి దాని వెనుక ఉన్నదా? అని. ఈ సృష్టి వెనుక ఒక మహత్తరమైన శక్తి ఉన్నది. ఆ శక్తియే అల్లాహ్. ప్రతి చిత్రమూ అల్లాహ్ ప్రతి బింబమే. ప్రతి సృష్టికీ ఆయనే సృష్టికర్త. ఆయన ఏ అక్కరా, ఏ అవసరమూ లేని వాడు. ఈ సృష్టి ఉనికికి, దాని స్థితి లయలకు కారకుడు, దీని అవసరాలను తీర్చే యజమాని, దీని విర్వహణ బాధ్యతను స్వీకరించిన పరిపోషకుడు. తానే స్వయంగా నిర్ణయించిన ఒక రోజున దీనంతటినీ సర్వ నాశనం చేసి తాను తలచినప్పుడు దీన్ని పునర్నిర్మించి యథా తథంగా తీసుకు రాగల ఏకైక శక్తిశాలి. ఆయన ఒకే ఒక్కడు. నిరపేక్షాపరుడు. ఏ అక్కరా లేని వాడు. ఆయన ఎవరినీ కనలేదు, ఆయన కూడా ఎవరికీ పుట్టిన వాడు కాడు. ఆయనకు సరిసమానుడు ఎవడూ లేడు.



అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేనే లేడు. ఆయన సజీవుడు. అన్నింటికీ మూలాధారం. ఆయనకు కునుకుగానీ, నిద్రగానీ, పట్టదు. భూమ్యాకశాలలో ఉన్న సమస్తమూ ఆయన అధీనంలో ఉంది. ఆయన అనుమతి లేకుండా ఆయన సమక్షంలో సిఫారసు చేయగలవాడెవడు? వారికి ముందు ఉన్న దానినీ, వెనుక ఉన్న దానిని కూడా ఆయన ఎరుగు. ఆయన కోరినది తప్ప ఆయనకున్న జ్ఞానంలోని ఏ విషయమూ వారి గ్రాహ్యపరిధిలోకి రాదు. ఆయన కుర్చీ వైశాల్యం భూమ్యాకాశాలను పరివేష్టించి ఉంది. వాటిని రక్షించటానికి ఆయన ఎన్నడూ అలసిపోడు. ఆయన సర్వోన్నతుడు. గొప్పవాడు. అల్లాహ్ అనే పదానికి లింగ బేధమూ లేదు. బహు వచనమూ లేదు. అందుకే మనందరి సృష్టి కర్త, పాలకుడు అయిన ఆయనకు అల్లాహ్ అనే పదం నామవాచకమయ్యింది.

telgo.indd 10 5/3/11 1:26 PM

సయ్యద్ అబ్దుస్సలాం ఉమ్రీ
abdussalamsyed@ymail.com

నేను ఇబ్రాహీమ్ ప్రార్థనా ఫలాన్ని

ఈసా సువార్త రూపాన్ని

(గత సంచిక తరువాయి..)

"తర్వాత శారాయి తన దాసియైన హాగరును ఐగుప్తురాలిని తీసుకొని తన పెనుమటియైన అబ్రహామునకు 'భార్య'గా ఉండునట్లు అతనికిచ్చెను". (ఆదికాండము - 16: 3)

ఒక సాధారణ స్త్రీని ఒక వ్యక్తి వివాహ మాడినప్పుడు ఆమె బానిస అయినా లేదా అంతకన్నా అధమ స్థితికి చెందిన స్త్రీ అయినా చట్టరీత్యా అతనికి భార్య అవుతుంది. ఆమె సంతానం సొంత సంతానం అవుతుందే తప్ప దాసి సంతానంగా ఉండదు. ఈ కారణంగానే ఇబ్రాహీమ్ (అ) హాజ్రత్ ఇస్మాయీల్ (అ) గారిని ఎంతగానో ప్రేమించారు. ఎంతగానంటే ఇస్సాకును గూర్చిన శుభవార్తను దైవ దూతలు విన్పించినప్పుడు ఆయన - "ప్రభూ! కేవలం ఇష్మాయేలును మాత్రమే నీ సన్నిధిలో బ్రతికి ఉంటే చాలును కదా" అని వేడుకున్నారు. ఆయన మొరనాలకించిన దేవుడు ఇలా సమాధానపర్చాడు: "ఇష్మాయేలును గూర్చి నీవు చేసిన మనవిని నేను వింటిని. ఇదిగో నేనతనిని ఆశీర్వదించి అతనికి సంతానాభివృద్ధి కులుగ జేసి అత్యధికముగా అతని విస్తరింప జేసెదను. అతడు పన్నెండ్రు మంది రాజులను కనును; అతనిని గొప్ప జనముగా చేసెదను". (ఆదికాండము- 17: 21)

ఇష్మాయేలు అనే పేరు కూడా దేవుడు నిర్ణయించినదే. "ఇదిగో యెహోవా నీ మొర వినెను. నీవు గర్భవతివై ఉన్నావు. నీవు కుమారుని కని అతనికి ఇష్మాయేలు అన్న పేరు పెట్టెదవు". (ఆదికాండము-16: 11) నీ సంతానమును నిశ్చయముగా విస్తరింప జేసెదను. అది లెక్కింప వీలులేనంతగా విస్తారమవునని దానితో చెప్పెను".

(ఆదికాండము- 16:10)

'దేవుడు ఆ చిన్నవానికి తోడైయున్నాడు'

(ఆదికామడము- 21: 20)

-పై వచనాల్ని బట్టి హాజ్రత్ ఇస్మాయీల్ (ఆ) దైవ నిర్ణయంతో పుట్టి, దైవ నిర్ణయించిన పేరు పెట్టుకుని, దైవంచే అనేమార్లు ఆశీర్వదించబడి, దైవం తోడుతో ఆయన కారుణ్యచ్ఛాయల్లో పెరిగారు. మరలాంటి ఘనుణ్ణి దాసి సంతానం అనడం ఎంత వరకు సబబు?

ఇస్సాకుకు ఎవ్వరూ వారసులు ఉండ కూడదు అని ఇష్మాయేలును హాజ్రత్ సారా (అ) వెళ్ళగొట్టిన మాట ఎంత వరకు నిజమో తెలియదుగానీ - హాజ్రత్ హాజిరా (అ) ఇబ్రాహీం (అ)ను కారణం అడినప్పుడు దైవాదేశం మేరకేనని ఆయన చెప్పడం గమనార్హం. ఇక ధర్మ శాస్త్రం ప్రకారం చూసినా హాజ్రత్ ఇబ్రాహీమ్ (అ) గారి జేష్ఠ కుమారుడు హాజ్రత్ ఇస్మాయీల్ (అ)గారే అవుతారు. చూడండండి!

"ప్రేమించబడినదొకతెయు, ద్వేషించ బడిన దొకతెయు ఇద్దరు భార్యలు ఒక పురుషునికి కలిగి ఉండి, ప్రేమించబడినదియు, ద్వేషించబడినది వాని వల్ల బిడ్డలు కని, జేష్ఠ కుమారుడు ద్వేషించ బడినదాని కొడుకైన యెడల, తండ్రి తనకు కలిగిన దానిని తన కుమారులకు సొష్ఠముగా ఇచ్చువాడు ద్వేషించబడిన దాని కుమారుడైన జ్యేష్ఠునికి మారుగా ప్రేమింపబడినదాని కుమారుని జ్యేష్ఠునిగా చేయకూడదు. ద్వేషించబడిన దాని కుమారునికి తండ్రి తన ఆస్తి అంతటిలో రెట్టింపు భాగమిచ్చి వానికే జ్యేష్ఠునిగా ఎంచవలెను. వీడు వాని బల ప్రారంభము గనుక జ్యేష్ఠ సర్వాధికారము వానిదే".

(ది.ఉ.కా- 21: 17)

"ప్రభూ! కేవలం ఇష్మాయేలును మాత్రమే నీ సన్నిధిలో బ్రతికి ఉంటే చాలును కదా" అని వేడుకున్నారు. ఆయన మొరనాలకించిన దేవుడు ఇలా సమాధానపర్చాడు: "ఇష్మాయేలును గూర్చి నీవు చేసిన మనవిని నేను వింటిని. ఇదిగో నేనతనిని ఆశీర్వదించి అతనికి సంతానాభివృద్ధి కులుగ జేసి అత్యధికముగా అతని విస్తరింప జేసెదను. అతడు పన్నెండ్రు మంది రాజులను కనును; అతనిని గొప్ప జనముగా చేసెదను".
(ఆదికాండము- 17: 21)

చివరి మాట:

ఆలోచించండి! ఒక వ్యక్తికి ఇద్దరు భార్యలుండి ఒక భార్య ద్వారా మొదటి సంతానం కలిగినప్పుడు దైవం తన కారుణ్యాన్ని ఆమెపై కురిపించి సంతానాన్ని కలగజేశాడు అని అంటాము. మరి ఇబ్రాహీమ్ (అ) గారికి హాజిరా ద్వారా మొదటి సంతానం కలిగింది. అంటే దైవకారుణ్యానికి హాజిరాయే మొదట అర్హురాలయ్యింది. దీని ద్వారా కూడా విదితమయ్యేదేమిటంటే హాజ్రత్ ఇస్మా యీల్ (అ) దాసి సంతానం కాదు. పైగా ఆయన మహోతృష్ట ప్రవక్త. అల్లాహ్ మనందరికి సత్యాన్ని సత్యంగా స్వీకరించే సత్బుద్ధిని ప్రసాదించుగాక! ఆమీన్.

telgo.indd 11 5/3/11 1:26 PM

సయ్యద్ అబ్దుస్సలాం ఉమ్రీ
abdussalamsyed@ymail.com

సత్య ప్రవక్త (స) వారి సమయ స్ఫూర్తి



మనిషిలోని భావాలను, క్రోధావేశాలను, ఆశామోహాలను అదుపు చేసి నిర్మాణాత్మక దిశన పయనించేలా చేయడం ఆదర్శ పార దర్శకత అన్పించుకుంటుంది. దైవ ప్రవక్త (స) తన సహచరులతో మంచిగా వ్యవహ రించ డమేకాక, వారి మనసుల్లో మెదిలే ఆలోచ నల్ని, భావావేశాల్ని సయితం అర్థం చేసుకునే వారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి వారి లోని ఆశామోహాలు ఆశయ సిద్ధికై తోడ్పడేలా తర్పీదు ఇచ్చేవారు. పరిస్థితులు ఎంత తారు మారయినా ఆయన (స) సంయమనాన్ని ప్రదర్శిస్తూ అందరినీ ఏక త్రాటిపై నడిపించి, క్షణికావేశంలో వారు మరచిన ధర్మాన్ని గుర్తు చేసేవారు. తానూ వారిలో ఒక సామాన్య సభ్యుడననే విషయాన్ని స్వయంగా వారు గ్రహించేలా చేసేవారు.

అది హుదైబియా ఒప్పందం. ఇస్లామీయ చరిత్రలోనే నూతనోధ్యాయానికి నాంది వాచ కంగా నిలిచిన సంఘటన. స్వయంగా ఆ పరమ ప్రభువే **'స్పష్టమైన విజయం'** అని కితాబు ఇచ్చిన సంఘటన. ఖురైషులు మరియు ముస్లింల మధ్య జరిగిన సంధి లోని ఓ షరతు– **'ఖురైషులకు చెందిన ఏ వ్యక్తి అయినా ముస్లిం అయి ముహమ్మద్ (స) వద్దకు వచ్చి చేరితే, అతనిని తిరిగి ఖురైషులకు అప్పగించవలసి ఉంటుంది'** అన్నది.

ఒప్పందం పత్రం రాయడం ఇంకా పూర్తి కానేలేదు. సుహైల్ బిన్ అమ్ర్ (ఖురైషుల తరపు నుంచి సంధీ ఒప్పందం కోసం వచ్చిన వ్యక్తి) కుమారుడు 'అబూ జందల్' తన కాళ్ళకు వేయబడిన సంకెళ్ళను బరువుగా ఈడ్చుకుంటూ ప్రవక్త (స) వారి సన్నిధికి వచ్చారు. ఆయన ఇస్లాం స్వీకరించి, ఖురైషులు పెట్టే హింసలను భరించలేక పారిపోయి రక్షణ నిమిత్తం వచ్చారు. ఇది గమనించిన తండ్రి సుహైల్ **'ఇతను ఈ ఒప్పందానికి సంబంధించిన ప్రథమ వ్యక్తి. కాబట్టి ఇతణ్ణి మీరు నాకు అప్పగించాలి'** అని డిమాండు చేశాడు. ప్రవక్త (స) ఎంతో నచ్చజెప్పేందుకు – పయత్నించారు. కానీ వినేందుకు సుహైల్ సిద్ధంగా లేడు. అప్పుడు అబూజందల్ 'ముస్లిం లారా! నేను తిరిగి ముష్రికుల వద్దకు వెళ్ళాలా? వీరు–నేను ఇస్లాం స్వీకరించానన్న ఒకే ఒక్క నేపంతో నన్ను చిత్రహింసలు పెడు తున్నారు' అని పెద్దగా అరిచారు. 'నా ఈ దుస్థితిని చూసి కూడా మీరు నన్ను తిరిగి వాళ్ళకే అప్పగిస్తున్నారా?' అని విలపించారు.

ఇలాంటి క్లిష్టతర సమయంలో ముస్లిం యువకుల మనో భావాలు ఎలా ఉండి ఉంటాయో ఒక్క నిమిషం ఆలోచించండి! ఎన్నో యుద్ధాల్లో శత్రువుల్ని మట్టి కరిపించిన సత్య సమరయోధులు వారు. ఆ యువ భావోద్రేకాల ప్రతి రూపమే హజ్రత్ ఉమర్ (ర) గారి ఈ ఉద్వేగభరిత ప్రశ్న: "ఓ దైవప్రవక్తా! మనం ఇంతగా అణగిమణగి సంధి ఎందుకు కుదుర్చుకున్నట్లు? ఏమిటి మీరు దేవుని ప్రవక్త కారా? ఏమిటి మన ధర్మం సత్య ధర్మం కాదా? ఏమిటి ఖురైషులు అధర్మావలంబీకులు కారా?' ఉద్వేగ పూరిత ఈ ప్రశ్నను వింటూనే సంధి ఒప్పం దాన్ని పూర్తి చేశారు ప్రవక్త (స). ఆ తర్వాత విశ్వాసులనుద్దేశించి –**"లేవండి! మీ మీ పశువులను జిబహ్ చేయండి".** అన్నారు సహాబాలందరూ తీవ్ర దిగ్భ్రాంతికి లోనయి ఉన్నారు. వారి దేహాలు హుదైబియా ప్రాం తంలోనే ఉన్నా, వారి ఆలోచనలు మాత్రం పరిపరి విధాలుగా ఎక్కడెక్కడో ఉన్నాయి. వారందరూ మదీనా నుండి బయలుదేరి నప్పుడు – ఓ సుదీర్ఘ కాలం తార్వత 'కాబా' పవిత్ర గృహ దర్శనం చేయబోతున్నాం' అన్న దృఢ సంకల్పంతో బయలుదేరారు. మినాలో వెళ్ళి ఖుర్బానీ ఇవ్వాలనీ, అరపా మైదానంలో విడిది చేయాలని, ముజ్దలిఫా లో రాత్రి గడపాలని, తవాఫె ఇఫాజా చేయాలని, జమ్‌జమ్ జలం త్రాగాలని ఎన్నో కలలు కన్నారు. వారు కన్న కలలన్నీ కల్లలవుతూ చూసి వారు చలించిపోయారు. ఎలాంటి ఆయుధాలు వారి వద్ద లేక పోయినా ఖురైషులు వారిని అడ్డుకోవడం వారు జీర్ణించు కోలేక పోయారు. ఇది సరిపో దన్నట్లు సంధి ఒప్పందం కుదుర్చుకోవ డంతో వారు షాకేకు గురయ్యారు. వారి భావావేశాలు దెబ్బ తిన్నాయి. లోలోన వారి ఆలోచనలు జ్వాలాగ్నిలా పెల్లుబుకుతున్నాయి. వారి మనో భావ స్థితి తీవ్రత ఎలా ఉందంటే – దైవ ప్రవక్త (స) వారి ఒక్క సైగపై ప్రాణాల్ని సయితం ఖాతరు చెయ్యని సహాబా, ప్రవక్త (స) వారి ఆదేశం విని కూడా మౌనంగానే ఉన్నారు. దైవప్రవక్త (స) "లేవండి! మీ మీ పశువులను ఖుర్బానీ చేయండి" అని మూడేసి మార్లు చెప్పినా వారిలో ఎలాంటి ప్రతిస్పందన లేదు. వారి లోని ప్రతి వ్యక్తి కొయ్యబారి ఉన్నాడు. అడుగు ముందుకు వేయబోయి పాము కాటు తగిలినట్లు తమ తమ స్థానంలో కూర్చుండి పోయారు వారు.

మహా ప్రవక్త (స) పరిస్థితిని అర్థం చేసు కున్నారు. సహాబాల వైఖరి ఒకింత ఆశ్చర్యానికి లోను చేసినా నిరాశ చెందలేదు ఆయన. విశ్వాసుల మాత హజ్రత్ ఉమ్మె సలమా (స) గారి దగ్గరకు వెళ్ళి సహచరుల వింత ప్రవర్తన గురించి చెప్పారు. సతీమణి సలహా మేరకు దైవ ప్రవక్త (స ఎవరితోనూ ఏమి మాట్లాడకుండా నేరుగా వెళ్ళి తన పశువులను జిబహ్ చేసి, తన తల వెంట్రు కలను క్షవరం చేసుకున్నారు. దైవప్రవక్త (స) ఇలా చేస్తుండటం చూసి అప్పుడే షాక్ నుండి తేరుకున్న సహచరులు కూడా లేచి తమ తమ హదీ జంతువులను జిబహ్ చేసి, క్షవరం చేసుకున్నారు. ఈ విధేయతలో సయితం వారి కోపావేశాలు కనబడుతూనే ఉన్నాయి. చివరికి అందరూ 'విన్నాము, విధేయులయ్యాము' అన్న స్థాయికి చేరుకు న్నారు.

చూశారుగా! సునామీలా చెలరేగే భావోద్రేకాల ప్రవాహాన్ని దైవ ప్రవక్త (స) దారి మళ్ళించి ఎలా నిర్మాణాత్మక దిశలో పయనించేలా చేశారో!! ఎలా వారిలో మళ్ళి విధేయతా పూలను పూయించారో!!!

telgo.indd 12 5/3/11 1:26 PM

అది హునైన్ యుద్ధానంతరం జరిగిన ఘటన. ఆ యుద్ధంలో లభించిన 'మాలె ఫై' (విజయ ప్రాప్తి)ని అప్పుడే ఇస్లాం స్వీకరించిన వారి హృదయాల్ని చూరగొనే నిమిత్తం మహా ప్రవక్త (స) పంచి పెట్టారు. "ఎవరి గుప్పెట్లో నా ప్రాణాలున్నాయో ఆ పరమ ప్రభువు సాక్షి! నా దగ్గర తహామా అడవి (మహా అరణ్యం)లో ఉన్న చెట్లన్ని పశువులు ఉన్నా వాటిని కూడా నేను మీకు పంచి పెడతాను. అప్పుడు సయితం మీరు నన్ను పిసినారిగా, పిరికివానిగా చూడలేరు సుమా!" అన్నది అక్షరాల అంతమ దైవప్రవక్త (స) వారి నోట జాలు వారిన ఆణిముత్యం అని అన్సారులకు అర్థ మవుతున్నా, మానవ దౌర్బల్యాల దృష్ట్యా, దూరదృష్టి లోపించడం వల్ల ఈ పంపకం వారిని బాగా కృంగదీసింది. కష్ట సమయంలో ముందుకు వచ్చి స్థిరంగా నిలబడి సాహసోపేతంగా పోరాడి, ఘోరపరాజయాన్ని ఘన విజయంగా మార్చేందుకు దోహదపడింది అన్సారులే. కాని వెన్ను చూపి పారిపోయిన వారికే ఆ విజయ ప్రాప్తి లభించడంతో వారు కాసింత నిరాశ చెందారు. వారిలో గుస గుసలు మొదలయ్యాయి. దైవ ప్రవక్త (స) ఖురైషులకే మొత్తం పంచి పెట్టేశారు అన్న అపవాదు కూడా వినిపించింది. ఇది తెలుసుకున్న దైవ ప్రవక్త (స) అన్సారుల నాయకుడైన సయీద్ బిన్ ఉబాదా (ర) గారిని పిలిచి "ఓ సయీద్! ఈ విషయంలో నీ అభిప్రాయం ఏమిటి?" అనడిగారు. 'ప్రవక్తా! నేనూ నా జాతికి చెందినవాణ్ణే కదా!' అన్నారు సయీద్ (ర). పరిస్థితి విషమించనున్నదన్న సంగతిని పసిగట్టిన ప్రవక్త (స), సయీద్ (ర)ను ఆదేశిస్తూ– అన్సారులందరిని ఓ చోట సమావేశ పర్చమన్నారు. అందరూ ప్రోగయ్యాక–

మహా ప్రవక్త (స) వారి వద్దకు వచ్చి, అల్లాహ్‌ను స్తుతించారు. ఆ తర్వాత ఇలా ఉపదేశించారు: "అన్సారు ప్రజలారా! మీరు పరస్పరం దేని గురించి గుసగుసలాడుతున్నారు? నా యెడల మీరు లోలోపల మధన పడటం ఏమిటి? నా ఏ ప్రవర్తన మీ మనస్సును నొప్పించింది? నేను మీ దగ్గరకు వచ్చిన ప్పుడు మీరంతా మార్గభ్రష్టులుగా ఉన్న విషయం నిజం కాదా? అల్లాహ్ మీకు నా మాధ్యమంతో సన్మార్గాన్ని ప్రసాదించాడు. మీరు కటిక దారిద్ర్యంలో ఉంటే అల్లాహ్ నా ద్వారా మిమ్మల్ని సంపన్నుల్ని చేసిన మాట నిజం కాదా? మీరు వైర భావంతో పరస్పరం శత్రువులుగా వ్యవహరిస్తున్నప్పుడు అల్లాహ్ తన కృపతో మీ హృదయాలను కలిపి స్నేహ సౌరభాలను వెదజల్లలేదా?ప్రజలారా! అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స) ఉపకారం మీ మీదున్న విషయం వాస్తవం కాదా?" (అందరూ మౌనం వహించి ఉన్నారు). అప్పుడు మళ్ళీ ప్రవక్త (స) ఇలా అన్నారు: "ప్రజలారా! మాట్లాడరేమిటి? నా మాటకు బదులివ్వరేమిటి?" అని నిలదీశారు.

'యా రసూలల్లాహ్! మేమేం సమాధాన మివ్వగలం? ఖచ్చితంగా మాపై అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స) ఉపకారం కృపా కటాక్షం ఉంది. ఇది వారి కరుణ చలువతో ప్రాప్తమయినదే' అన్నారు అన్సారులు. తరువాత మాటను కొనసాగిస్తూ దైవప్రవక్త (స) ఇలా అన్నారు:

"ఓ అన్సారు ప్రజలారా! మీరు తలచుకుంటే జవాబివ్వగలరు. అప్పుడు మీరుఇచ్చే సమాధానం నిజమే అవుతుంది. అందుకు నేను సయితం సాక్షిగా ఉంటాను. మీరనగలరు – 'ఓ ముహమ్మద్! ప్రజలందరూ మిమ్మల్ని, మీ సందేశాన్ని తృణీకరించిన దయనీయ తరుణంలో మీరు మా వద్దకు వచ్చారు. మేము మీ మాటను అక్షర సత్యంగా నమ్మాము. మిమ్మల్ని మీ జాతి ప్రజలు స్వస్థలం నుండి వెలివేసి నిస్సహాయులుగా వదిలేస్తే మేము మిమ్మల్ని బల పర్చాము. మీకు నీడనిచ్చి ఆశ్రయం కల్పించాము. మీరు బాధల్లో ఉంటే మేము మిమ్మల్ని ఓదార్చి అండగా నిలిచాము' అని మీరు అనగలరు. మీ మాట సత్యం అని నేనూ ధృవీకరిస్తాను.

ఓ అన్సారు ప్రజలారా! తుచ్ఛమైన ప్రాపంచిక తృణం విషయంలో మీ నా పట్ల అసంతృప్తులై ఉన్నారా!? ఈ ధనాన్ని నేను వారిలో పంచింది వారు ధర్మ మార్గం మీద నిలకడ కలిగి ఉండాలనేగా! వారి హృదయాల్ని చూర గొనేందుకేగా! మిమ్మల్ని మీ ధర్మానికే అప్పజెప్పుతున్నాను.

"ఓ అన్సారు ప్రజాలారా! మీకీ విషయం సంతోషాన్నివ్వదా? వారు ఒంటెలు, మేకలు తీసుకు వెళుతుంటే, మీరు అల్లాహ్ ప్రవక్తను మీ వెంటబెట్టుకెళ్ళడం మీకు ఆనందానివ్వదా? ఎవరి అధీనంలో ముహమ్మద్ (స) ప్రాణముందో ఆ శక్తి స్వరూపుని సాక్షిగా చెబుతున్నాను; మీరు మీ వెంటి తీసుకెళ్ళేది, వారు తమ వెంట తీసుకెళ్ళే దానికన్నా ఎంతో ఘనతరమైనది, శ్రేష్ఠతరమైనది, శ్రేయో దాయకమైనది, మహోత్కృష్టమైనదీను. దైవ సాక్షి! ఒకవేళ హిజ్రతే గనక లేకపోయి ఉంటే నేను కూడా అన్సారుల్లోని ఒక వ్యక్తి అయివుండే వాణ్ణి. ప్రజలంతా ఒక కనుమన పయనించి, అన్సారులు మరో కనుమన పయనిస్తే నేను అన్సారుల కనుమలోనే పయనిస్తాను. అన్సారులు నా సమీప మిత్రులు. తక్కినవారు వారి తర్వాతే. ఓఅల్లాహ్! అన్సారులను కరుణించు. వారి కుమారుల్ని మరియు కుమారుల సంతానాన్ని కరుణించు". అంటూ ప్రార్థనా పలుకులతో తన మాటను పూర్తి చేశారు అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (స).

ఓ అన్సారు ప్రజలారా! తుచ్ఛమైన ప్రాపంచిక తృణం విషయంలో మీ నా పట్ల అసంతృప్తులై ఉన్నారా!? ఈ ధనాన్ని నేను వారిలో పంచింది వారు ధర్మ మార్గం మీద నిలకడ కలిగి ఉండాలనేగా! వారి హృదయాల్ని చూర గొనేందుకేగా! మిమ్మల్ని మీ ధర్మానికే అప్పజెప్పుతున్నాను.

ప్రవక్త (స) వారి వాత్సల్యభరిత ఉపన్యాసం విని అక్కడున్న ప్రజలు ఎంతగా ఆశ్రుసిక్తులయ్యారంటే వారి గడ్డాలు తడిసి ముద్దయ్యాయి. రుద్ధ కంఠంతో వారందరూ – "రసూలుల్లాహ్ పంపకం పట్ల మేముంతా సంతృప్తులై ఉన్నాము. దైవ ప్రవక్త (స) మా వాటాలోకి రావడం నిజంగా మా సుకృత ఫలం" అని ఆనంద భాష్పాలు రాల్చారు. (జాదుల్ మఆద్)

ఆలోచించండి! భావోద్రేకాలు ఏ దిశన పయనిస్తున్నాయో!! దైవ ప్రవక్త (స) సమయస్ఫూర్తిని ప్రదర్శించకుండా ఉండి ఉంటే, వారి భావావేశాలను అర్థం చేసుకోకుండా ప్రసంగించి ఉంటే పరిస్థితి అదుపు తప్పి సమస్య ఎంత జఠిలంగా తయారయ్యేదో ఒక్కసారి ఆలోచించండి!!

హజ్రత్ సయీద్ బిన్ ఉబాదా (ర) నోట, అన్సారు ప్రజల షికాయతు, ఫిర్యాదు విని ప్రవక్త (స) కోపగించుకోలేదు. వారి మనసు నొప్పించే పల్లెత్తు మాట కూడా అనలేదు. ప్రవక్త (స), వారి భావోద్రేకాలను అర్థం చేసుకున్నారు. మానవ దౌర్బల్యాల వల్ల ఏర్పడే తాత్కాలిక అలలు భావోద్రేకాలు అని ప్రవక్త (స) వారికి బాగా తెలుసు. ఈ ప్రవాహాన్ని ఆనకట్ట వేసి నియంత్రించడం కన్నా సరైన దిశానిర్దేశంతో చరితార్థ చేయాలని సంకల్పించారు ప్రవక్త (స). ఈ ఉద్దేశ్యంతోనే ప్రవక్త (స) స్వయంగా వెళ్ళి వారితో సంభోధించారు. ముందు వారిని శాంత పర్చి, వారి గతాన్ని వారికి గుర్తు చేసి తర్వాత వారి మనో సీమల్లో మెదిలే భావాలకు సయితం అక్షర రూపం ఇచ్చి, వారితో తనకున్న బాంధవ్యం ఎట్టిదో ఎరుక పర్చారు. తత్ఫలితంగా తాత్కాలికంగా పేరుకు పోయిన అపోహల, అపార్థాల కర్రి మబ్బులు ఒక్క వెలుగు తునకతో తునా తునకలయిపోయాయి. మునుపటికన్నా అధికంగా వారిలో ప్రవక్త (స)వారి పట్ల ప్రేమాభిమానాలు పెల్లుబుకాయి.

telgo.indd 13 5/3/11 1:27 PM

అబ్దుల్ మతీన్ ఉమ్రీ

ముస్లిం ధార్మిక విశ్వాసం

ప్రశ్న: మనము అల్లాహ్‌ను ఏ విధంగా వేడుకోవాలి ?

జవాబు: మనము అల్లాహ్‌ను ఆయన పేర్లు, ఆయన గుణవిశేషాలు, సదాచరణల ద్వారా వేడుకోవాలి.

ఖుర్‌ఆన్: అల్లాహ్‌కే మంచి పేర్లు ఉన్నాయి. మీరు ఆయనను మంచి పేర్లతోనే వేడుకోండి. (అల్ ఆరాఫ్:180)

హదీస్: మీరు మీ కోసం పెట్టుకున్న ప్రతి పేరు ద్వారా నేను మిమ్మల్ని పిలుస్తాను.(అహ్మద్)

ప్రశ్న: అల్లాహ్‌ను వేడుకోనడానికి ఎవరి సహాయమైనా అవసరం ఉందా?

జవాబు: ఎవరి సహాయం తీసుకునే అవసరం లేదు.

ఖుర్‌ఆన్: నా దాసులు నా గురించి నిన్ను అడిగితే నేను వారికి అత్యంత సమీపంలోనే ఉన్నాననీ, పిలిచేవాడు నన్ను పిలిచినప్పుడు నేను అతని పిలుపును వింటాను, సమాధానం పలుకుతాను అనీ, ఓ ప్రవక్తా! నీవు వారికి తెలుపు.(అల్ బఖర : 186)

హదీస్: నిశ్చయంగా మీరు అత్యంత సమీపంలో ఉండే, బాగా వినే అస్థిత్వాన్ని వేడుకుంటున్నారు. ఆయన మీతోపాటు ఉన్నాడు.(ముస్లిం)

ప్రశ్న: దైవ ప్రవక్త (స) పని ఏమిటి?

జవాబు: దైవాదేశాలను ప్రజలకు చేరవేయడం.

ఖుర్‌ఆన్: ప్రవక్తా! నీ ప్రభువు తరపు నుండి నీపై అవతరించిన దానిని ప్రజలకు అందజెయ్యి. (అల్ మాయిద : 67)

హదీస్: ఓఅల్లాహ్ నేను అందజేశాను. నీవు సాక్షిగా ఉండు.(ముస్లిం)

ప్రశ్న: దైవ ప్రవక్త (స) సిఫారసు ప్రసాదించమని మనం అల్లాహ్‌ను వేడుకోవచ్చా?

జవాబు: వేడుకోవచ్చు.

ఖుర్‌ఆన్: ప్రవక్తా! మీరు ఇలా అనండి: సిఫారసు అనేది పూర్తిగా అల్లాహ్ చేతిలోనే ఉన్నది. (అజ్ జుమర్ :44)

హదీస్: ఓ అల్లాహ్! నీవు ఆయన్ని నా కోసం సిఫారసు చేసేవారిగా చెయ్యి. (తిర్మిజి)

ప్రశ్న: అల్లాహ్‌ను ఆయన ప్రవక్త(స) ను మనం ఏ విధంగా ప్రేమించాలి?

జవాబు: అల్లాహ్ ఆదేశాలు, ఆయన ప్రవక్త(స) ఆదేశాలకను గుణంగా నడుచుకోవడం. ప్రవక్త(స)కు విధేయత చూపడం ద్వారా మనం అల్లాహ్‌ను, ఆయన ప్రవక్త(స)ను ప్రేమించాలి.

ఖుర్‌ఆన్: ప్రవక్తా! నీవు ఇలా అను: అల్లాహ్‌కూ, ప్రవక్తకూ విధేయత చూపండి. ఒకవేళ వారు నీ ఈ సందేశాన్ని స్వీకరించకపోతే, అల్లాహ్ తనకూ, తన ప్రవక్తకూ విధేయత చూపటానికి నిరాకరించిన వారిని ప్రేమించడం అనేది నిశ్చయంగా జరగదు. (ఆలి ఇమ్రాన్:31)

హదీస్: మీలో ఎవరైనా సరే అతని మనోవాంఛలు నేను తెచ్చిన ప్రబోధనలకు (షరీఅత్‌కు) లోబడి ఉండనంతవరకూ అతను నిజమైన విశ్వాసి కాజాలడు. (షర్హుస్సున్న, మిష్కాత్, బుఖారి)

ప్రశ్న: దైవ ప్రవక్త(స)ను ప్రశంసించే విషయంలో హద్దుమీరి ప్రవర్తించవచ్చా ?

జవాబు: దైవప్రవక్త(స)ను ప్రశంసించే విషయంలో మితిమీరి ప్రవర్తించరాదు.

ఖుర్‌ఆన్: ప్రవక్తా! ఇలా చెప్పు: నేను కేవలం ఒక మానవుణ్ణి, మీలాంటి వాణ్ణి. నాకు వహీ (దైవ వాణి) ద్వారా తెలుపబడింది; మీ దైవం కేవలం ఒకే దైవం. (అల్ కహఫ్: 110)

హదీస్: మీరు నా విషయంలో మితిమీరి ప్రవర్తించకండి. నేనయితే కేవలం ఒక దాసుణ్ణి, నన్ను అల్లాహ్ దాసుడు, ఆయన ప్రవక్త అని అనండి. (బుఖారి)

ప్రశ్న: అల్లాహ్ తన సృష్టిరాసుల్లో మొదటగా ఎవరిని సృష్టించాడు ?

జవాబు: మనుషులలో హజ్రత్ ఆదం అలైహిస్సలాంను, వస్తువులలో కలాన్ని మొదటగా సృష్టించాడు.

ఖుర్‌ఆన్: మీరు ఆ సమయాన్ని గుర్తుకు తెచ్చుకోండి, అప్పుడు నీ ప్రభువు దైవదూతలతో ఇలా అన్నాడు: 'నేను మట్టితో మనిషిని సృజించబోతున్నాను'. (సాద్ : 71)

హదీస్: మొదటగా అల్లాహ్ కలాన్ని సృష్టించాడు. (అబూ దావూద్)

telgo.indd 14 5/3/11 1:27 PM

- అబుల్ హసన్

శిరసెత్తిన సెగలా

మనిషీ! నిఖిల సృష్టిలో ప్రవరుడవు నీవు
దైవ దూతలు సయితం నీ స్థాయిని
చూసి ఈర్ష్యానందం చెందారు
నీ చేతి వ్రేళ్ళ కొనలుల్లో నింగి
నిలువీతలీదుతున్నది

అంతరిక్షం అల్లావుద్దీన్ దీపంలా
నీ ప్రగతికి పూబాట వేస్తున్నది మింటనున్న
మిసిమిని ఇంట నిలుపుతున్నది
నువ్వు చిటికేస్తే గుహం గృహమై
గృహం గ్రహమై తిరుగుతున్నది

నువ్వు అడుగేస్తే హిమ గిరి
జీవ నదై పారుతున్నది
నువ్వు సైగ చేస్తే కరువు నిండు
వసంతం అవుతున్నది పుడమి
పసిడి పంటల్ని పండిస్తున్నది

మేధోపరంగా నింగికెగిసిన తారవి నువ్వు
మానవత్వం రీత్యా పాతాళానికి ఒరుగుతూ ఉంటే
ఆర్థికంగా అద్భుతాల్ని ఆవిష్కరించిన నువ్వు
ఆధ్యాత్మికంగా అధోగతికి గురవుతూ ఉంటే
మనీషిగా ఎదగాల్సిన నువ్వు మృగంలా వ్రర్తిస్తుంటే

శరీర శిఖరమైన నీ శిరస్సు రాయి-
రప్పల, పాము-పుట్టల ముందు సూర్య
చంద్రనక్షత్రాల ముందు వంగుతూ ఉంటే
నీ ప్రతిభ, నీ ప్రగతి తెగిల తల
జంతువులా మోకరిల్లుతూ బ్రతకకు

లేచిరా పైకి ఉవ్వెత్తు ఎగిసే ఉప్పెనలా
తోసుకురా తమో తలుపు ఉదయ భానులా
తరుముకురా చీకటిని శిరసెత్తి సెగలా
ఆత్మ నిండా జ్ఞాన దీప్తితో
చేతి నిండా శాంతి సురభితో
పెదవి నిండా మందస్మితితో
దేహం నిండా దయాసక్తితో

మార్పు ఇచ్చిన తీర్పు

చిల్లర రాళ్ళను మ్రొక్కమని ఆజ్ఞ
బార చాచిన తిరస్కృతితో అది
లా ఇలాహ ఇల్లల్లాహ్ అయింది

పసలేని ప్రతిమల్ని పొగడమని ఆనతి
హృది సహాయ నిరాకరణతో అది
అల్‌హమ్దులిల్లాహి రబ్బిల్‌ఆలమీన్ అయింది

షైతాన్ కొమ్ము కాయమని ఆదేశం
ప్రభువు వాణి గర్జనతో అది
అస్లమ్తు లిరబ్బిల్ ఆలమీన్ అయింది

విధ్వసం సృష్టించమని శాసనం
ఖుర్‌ఆన్ చేసిన హెచ్చరికతో అది
శాంతి సౌరభం అయింది

భ్రూణ హత్య చేయమని తీర్మానం
ప్రవక్త మహితోక్తి జీవ జలంతో అది
స్వర్గ సోపానం అయింది

పాపకృత్య గీతం వ్రాయమని బలవంతం
పదాలు చేసిన నిరసనతో అది
పుణ్య పచ్చ తోరణం అయింది

మృగోన్మాద చిత్రం గీయమని బలాత్కారం
కలం చేసిన కిటుకుతో అది
ప్రేమ పావురాయి అయింది

కలలో కలకలం

- ముహమ్మద్ ఖాన్
(గన్నవరం)

కొన్ని నిజాలు
కలల్లానే మిగిలి పోతాయి
కొన్ని కలలు
నిజాల్లా చెలామణీ చేసుకుంటాయి

నిజమయినా
కల అయినా నిజానికి
మానసిక బలహీనతే ఆధారం

నిజమో, కలయో తేల్చి
చెప్పలేని నా దుస్థితి
ఎవరు గుర్తించ గలరు?

కొన్ని కొన్ని సందర్భాలలో
నిజాన్ని నమ్మించే ప్రయత్నంలో
విఫలం కాక తప్పదు

మరికొన్ని ఆర్భాటాలలో
కలే నిజ రూపమెత్తి
బహు సునాయసంగా
అందర్నీ ఆకర్షిస్తుంది!
కల నిజం పలుకనన్నాళ్ళు
నిజం కలగా మారక తప్పదు!

ఎందుకనో

కలయినా నిజమయినా
నాకు రెండూ ఒకేలా కనిపిస్తాయి -
నాలో విశ్లేషించే శక్తి లేకనో
విశ్లేషించే ఆసక్తి లేకనేమో!
నేను నిజాన్ని ఎలా గౌరవిస్తానో
కలనూ అలానే గౌరవించాను

అయినా

కొన్ని కలలు నన్ను భయభ్రాంతుడ్ని
చేసే కుట్ర ఏదో పన్నుతూనే
ఉంటాయి! ఎందుకో?

అలాంటి కలల్ని జూచి జాలి పడ్తాను
ఎందుకో, నాకు శత్రువయినా జాలి ఎక్కువే!
ఎందుకొచ్చిన శత్రుత్వం చెప్పండి
మనం, ఉండేది ఇక్కడ కొన్నాళ్ళే!

telgo.indd 15 5/3/11 1:27 PM

మానవ జీవన జ్యోతి ఖురాన్

జి ఓబుల్ రెడ్డి (ముహమ్మద్)
మాధవరాయుని పల్లి . కడప



మనిషి పుట్టుక లక్ష్యం

నేను జిన్నాతులనూ మానవులనూ నా ఆరాధన కొరకు తప్ప మరి దేని కొరకూ సృష్టించలేదు. నేను వారి నుండి ఎలాంటి ఉపాధిని కోరను, వారు నాకు అన్నం పెట్టాలని నేను కోరను.

(జారియాత్: 56, 57)

అల్లాహ్ కు భాగస్వాములు లేరు

ప్రవక్తా! ఇలా చెప్పు: గ్రంథ ప్రజలారా! మాకూ మీకూ మధ్య సమానమైన ఒక విషయం వైపునకు రండి! (అది ఏమిటంటే) మనం అల్లాహ్‌కు తప్ప మరెవరికీ దాస్యం చెయ్యరాదు, ఆయనకు భాగస్వాములుగా ఎవ్వరినీ నిలబెట్టరాదు, మనలోని వారెవరూ అల్లాహ్‌ను తప్ప మరెవ్వరినీ తమ ప్రభువుగా చేసుకోరాదు అనేది. (ఆలి ఇమ్రాన్: 64)

ప్రతి విషయంలో అల్లాహ్‌నే స్మరించవలెను

అయితే ఒక నిర్ణయాన్ని తీసుకొని దాన్ని అమలు పరచటానికి సంకల్పించినప్పుడు అల్లాహ్‌పై భారం వెయ్యి. తననే నమ్ముకుని పని చేసే వారంటే అల్లాహ్‌కు ఎంతో ఇష్టం. అల్లాహ్ మీకు సహాయం చేస్తూ ఉన్నట్లయితే ఏశక్తి మీపై ఆధిక్యాన్ని సాధించలేదు. (ఆలి ఇమ్రాన్:159-160)

నీవు అల్లాహ్‌ను పిలిచినపుడు ఆయన నీ పిలుపును వింటాడు

నా దాసులు నన్ను గురించి అడిగితే నేను వారికి అత్యంత సమీపంలోనే ఉన్నాననీ, పిలిచేవాడు నన్ను పిలిచినప్పుడు నేను అతని పిలుపును వింటాను, సమాధానం పలుకుతాను" అని తెలియజెయ్యి.

(అల్ బఖర: 186)

అల్లాహ్‌యే దేవుడని నమ్మడం వల్ల కలిగే ప్రయోజనం

అల్లాహ్‌యే మా ప్రభువు అని పలికి ఆ మాట మీదనే స్థిరంగా నిలబడే వారిపై నిశ్చయంగా దైవదూతలు అవతరిస్తారు. వారు వారితో ఇలా అంటారు: "భయ పడకండి, బాధపడకండి. మీకు వాగ్దానం చేయబడిన స్వర్గశుభవార్తను విని ఆనందించండి. మేము ఈ ప్రాపంచిక జీవితంలో కూడా మీకు సహచరులుగా ఉంటాము, పరలోకంలో కూడా. అక్కడ మీరు కోరినదల్లా మీకు లభిస్తుంది. మీరు అశించే ప్రతి వస్తువూ మీదవుతుంది. (హామీమ్ అస్సజ్దా:30-32)

దివ్యఖుర్‌ఆన్ భయభక్తులు కలవారి గురించి ఈ విధంగా బోధిస్తుంది

(వినండి) భయభక్తులు కలవారి కొరకు నిశ్చయంగా ఉత్తమ నివాసం ఉంది. శాశ్వతమైన స్వర్గ వనాలు ఉన్నాయి. వాటి ద్వారాలు వారి కొరకు తెరవబడి ఉంటాయి. వాటిలో వారు దిండ్లకు ఆనుకొని కూర్చుంటారు. ఎక్కువ పండ్లను పానీయాలను కోరుతూ ఉంటారు. వారి ప్రక్కన సమవయస్కులైన, లజ్జావతులైన భార్యలు ఉంటారు. (స్వాద్:49-54)

భార్యాభర్తల గురించి

ఆయన సూచనలలో మరొకటి ఏమిటంటే ఆయన మీ కొరకు భార్యలను మీ జాతిలో నుండే సృష్టించాడు. మీరు వారి వద్ద శాంతిని పొందటానికి మీ మధ్య ప్రేమనూ, కారుణ్యాన్ని సృజించాడు నిశ్చయంగా ఆలోచనాపరులకు ఇందులో ఎన్నో సూచనలు ఉన్నాయి. (అర్రూమ్:21)

శీలవంతులైన స్త్రీలను పురుషులను హింసించే వారి గురించి

ఎవరైతే విశ్వాసులైన పురుషులను, స్త్రీలను హింసించారో, ఆ తరువాత దానికి పశ్చాత్తాప పడరో, నిశ్చయంగా వారు నరక యాతనకు గురవుతారు. ఆపై వారికి కాల్చివేసే శిక్ష పడుతుంది.

(అల్‌బురూజ్:10,11)

ఆస్తి గురించి

అనాథల ఆస్తిని వారికి తిరిగి ఇవ్వండి. వారి మంచి వస్తువులను మీ చెడ్డ వస్తువులతో మార్చకండి. వారి ఆస్తిని మీ ఆస్తితో కలిపి కబళించకండి. ఇది మహాపాపం.

(అన్నిసా:2)

మీలో మీరు ఒకరి ఆస్తిని మరొకరు అన్యాయంగా కబళించకండి. బుద్ధిపూర్వకంగా అక్రమమైన రీతిలో ఇతరుల ఆస్తిలో కొంత భాగం కాజేసే అవకాశం లభిస్తుందేమో అనే దురుద్దేశ్యంతో దానిని న్యాయ నిర్ణేతల వద్దకు తీసుకొని పోకండి.

(అల్‌బఖర:188)

సలాం చెయ్యడం

మీకు ఎవరైనా గౌరవభావంతో సలాము చేస్తే అతనికి మీరు ఉత్తమమైన పద్ధతిలో ప్రతి సలాము చెయ్యండి. లేదా కనీసం అదే విధంగానైనా చెయ్యండి. అల్లాహ్ ప్రతి దానికి లెక్క తీసుకుంటాడు.

(అన్నిసా: 86-87)

telgo.indd 16 5/3/11 1:27 PM

వడ్డీ గురించి

విశ్వసించిన ప్రజలారా! ఇబ్బడి ముబ్బడి గా పెరిగే ఈ వడ్డీని తినడం మానండి. అల్లాహ్‌కు భయపడండి. మీరు సాఫల్యం పొందే అవకాశం ఉంది. అవిశ్వాసుల కొరకు తయారు చెయ్యబడిన ఆ అగ్ని నుండి మిమ్మల్ని మీరు కాపాడుకోండి.

(ఆలి ఇమ్రాన్:130-138)



మీరు నిజంగా విశ్వాసులే అయితే అల్లాహ్‌కు భయపడండి. ఇంకా మీకు ప్రజల నుండి రావలసిన వడ్డీని విడిచి పెట్టండి. కాని ఒకవేళ మీరు అలా చెయ్యకపోతే, మీపై అల్లాహ్ తరఫు నుండి, ఆయన ప్రవక్త తరుఫు నుండి యుద్ధ ప్రకటన ఉంది అనే విషయం తెలుసుకోండి. (అల్ బఖర:278-281)

మద్యం జూదం గురించి

మద్యపానము జూదం గురించి, ప్రజలు నిన్ను ప్రశ్నిస్తారు. నీవు వారికి ఇలా ఉపదేశించు: 'ఈ రెంటిలోనూ కీడు ఉన్నది. వాటిలో ప్రజలకు కొన్ని లాభాలు ఉన్నా, ఈ లాభాలకంటే కలిగే కీడే ఎక్కువ'. (అల్‌బఖర:219)



విశ్వాసులారా! సారాయి, జూదం, దైవేతర మందిరాలు, పాచికల ద్వారా జోస్యం ఇవన్నీ అసహ్యకరమైన షైతాను పనులు. వాటిని విసర్జించండి. మీకు సాఫల్య భాగ్యం కలిగే అవకాశం ఉంది. షైతాను సారాయి, జూదాల ద్వారా మీ మధ్యన విరోధ విద్వేషాలను సృష్టించాలనీ, మిమ్మల్ని అల్లాహ్ స్మరణ నుండి వారించాలని కోర్తాడు. కనుక మీరు వీటిని మానుకుంటారాలేదా?(అల్ మాయిద:90,92)

ఇద్దరు లేఖకులు మన కర్మల్ని నమోదు చేస్తూ ఉంటారు

మేము మానవుణ్ణి సృష్టించాము. అతని మనస్సులో మెదిలే ఊహను సైతం మేము ఎరుగుదుము. మేము అతని కంఠ రక్త నాళం కంటే కూడా అతనికి చాల దగ్గరగా ఉన్నాము. అంతేకాదు ఇద్దరు లేఖకులు అతనికి కుడి ఎడమ ప్రక్కల కూర్చొని ప్రతి విషయాన్ని నమోదు చేస్తూ ఉన్నారు. అతని నోటి నుండి వెలువడే ప్రతి మాటనూ వ్రాయడానికి అనుక్షణం ఒక పరిశీలుడు సిద్ధంగా ఉంటాడు.

(ఖాఫ్:16-29)

మన జీవితం మన చేతిలోనే

ప్రతి మనిషి జాతకాన్ని మేము అతని మెడకే వ్రేలాడగట్టాము. ప్రళయంనాడు మేము ఒక పుస్తకాన్ని అతని కొరకు బయటికి తీస్తాము. అతడు దాన్ని ఒక తెరచిన గ్రంథం వంటిదని తెలుసుకుంటాడు. (బనీ ఇస్రాయీల్:)

మరణం కూడా వ్రాయబడి ఉంది

అల్లాహ్ అనుమతి లేనిదే ఏ ప్రాణి కూడా చావజాలదు. మరణ కాలం వ్రాయబడి ఉంది. (ఆలి ఇమ్రాన్ : 145)

జీవన జ్యోతి ఖుర్‌ఆన్

ఖుర్‌ఆన్ మానవ జీవితానికి జీవన జ్యోతి అని ఏకేశ్వరుడు అయిన అల్లాహ్ తెలియ జేస్తున్నాడు: మానవులారా! మీ ప్రభువు తరఫు నుండి మీ వద్దకు స్పష్టమైన నిదర్శనం వచ్చింది. మేము మీ వద్దకు మీకు స్పష్టంగా మార్గం చూపే జ్యోతిని పంపాము. (అన్నిసా: 174,175)

ఇస్లాం ధర్మం

దేవుడు ఒక్కడే అని నమ్మడం. ఆయన చిట్ట చివరి ప్రవక్త ముహమ్మద్(స)అని నమ్మడం. పవిత్ర ఖుర్‌ఆన్ చిట్ట చివరి దైవ గ్రంథమని నమ్మడం. నమాజు స్థాపించడం, జకాతు ఇవ్వడం, స్థోమత కలిగి ఉంటే హజ్ యాత్ర చెయ్యడం-ఇవి ముఖ్యమైనవి. వాస్తవం ఏమనగా అల్లాహ్‌ను ఆయన ప్రసాదించిన వరాలను రాస్తూపోతే సిరా (ఇంక్) ఖాళి అయిపోతుంది కాని ఆయన మాటలు మాత్రం పూర్తి కావు. అల్లాహ్ స్వయంగా ఇలా తెలియజేస్తున్నాడు:


ప్రవక్తా! ఇలా ప్రకటించు "ఒక వేళ నా ప్రభువు మాటలు వ్రాయడానికి సముద్ర జలమే సిరా అయినా అది ఖాళీ అయి పోతుంది, గాని నా ప్రభువు మాటలు మాత్రం పూర్తి కావు". (అల్ కహఫ్: 109)

మానవుడా ! ధర్మంగా జీవుంచు

భూమిని, ఆకాశాన్ని, సర్వలోకాన్ని సృష్టంచి; సూర్యున్ని కాంతిమంతంగా చేసి వెలుతురూ వేడిమి అందిస్తూ ఆకాశం నుంచి వాన రూపంలో నీటిని కురుపిస్తూ మట్టితో మనిషిని సృష్టించి ఆడమగ తేడాలు అమర్చి భార్యభర్తల అపురూప మైన సంబంధాన్ని కల్పించి, తల్లి గర్భంలో బిందువును అమర్చి ఒక ఆకారాన్ని తయారు చేసి శిశువురూపంలో బయటికి తీసి, పెంచి జ్ఞాపక శక్తినిచ్చి మనిషి రూపంలో నిన్ను తీర్చిదిద్దినవాడు ఆయనే సర్వలోకానికి సృష్టికర్త అయిన అల్లాహ్. ఆయన్ను మరువబోకు. నిన్ను ఎందుకు సృష్టించాడు ఒక్కసారి ఆలోచించు. ఆ ఏకేశ్వరుడయిన అల్లాహ్‌కు సాటి కల్పించకు. నీవు ఏ పని చేసినా ఆయన్నే స్మరించు. ఆయన నీకు అతి సమీపంలో ఉన్నాడు. నీవు పిలిచినప్పుడు ఆయన తప్పకుండా పలుకుతాడు.



దానధర్మాలు చెయ్యి. ధర్మం కూడబెట్టు. ఎవరయినా సలాము చేస్తే వారికి గౌరవంగా ప్రతి సలాం చెయ్యి. అల్లాహ్‌యే దేవుడని నమ్ము. నీకు దైవదూతలు ధైర్యం చెపుతారు. నీవు చేసే ప్రతి పని నీవు మాట్లాడే ప్రతి మాటను ఇద్దరు వ్యక్తులు రాస్తూ ఉంటారు. ఆ పత్రం నీ మెడకే ఉంటుంది. నీవు ఎప్పుడు మరణిస్తావు అనేది కూడా ఆయనకు తెలియకుండా జరగదు. నీవు విశ్వాసిగా మంచి పనులు చేసి చనిపోతే అల్లాహ్ మార్గంలో స్వర్గంలో సుఖ సంతోషాలతో శాశ్వతంగా ఉంటావు.



telgo.indd 17 5/3/11 1:29 PM

వన్య ప్రాణుల విన్యాసాలు

ఐపిసి తెలుగు విభాగం మార్చి నేలలో మౌలానా షేఖ్ అబ్దుస్సలాం ఉమ్రీ గారి సారథ్యంలో ఉమైరియాలోని జంతు ప్రదర్శనాశాలను సందర్శించారు తెలుగు న్యూ ముస్లింలు సోదరులు. అక్కడి వన్య ప్రాణుల విన్యాసాలు చూసి ఆనందించారు. ఎంతో ఆహ్లాదకర వాతావరణంలో సాగిన ఈ కార్యక్రమం మౌలానా షేఖ్ అబ్దుస్సలాం ఉమ్రీ గారి ప్రసంగంతో సమాప్తం అయింది.



ఆసిమా బ్రాంచీ ఆధ్వర్యంలో 'సామాజిక విలువలు' అన్న అంశంపై చర్చ

ఐపిసి తెలుగు విభాగం ఆధ్వర్యంలో 22- 03- 2011వ తేదీ మంగళవారం నాడు హవల్లీలో 'సామాజిక విలువలు' అన్న అంశంపై చర్చాగోష్టి కార్యక్రమం జరిగింది. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన ఈ కార్యక్రమం ప్రశ్నలు సమాధానాలు, విజేతలకు బహుమతులు ఇవ్వడంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి అన్ని విధాల సహకరించిన తెలుగు స్టూడెంట్స్ ముఖ్యంగా బ్రదబర్ అబ్దుల్లాహ్, నస్రుల్లా గారికి నిండు హృదయంతో కృజ్ఞతలు తెలుపడంతో తన మాటను పూర్తి చేశారు ఐపిసి ప్రబోధకులు సయ్యిద్ అబ్దుస్సలాం ఉమ్రీ.



telgo.indd 18 5/3/11 1:30 PM

ద్వితీయ ఖలీఫా ఉమర్ (ర) - 3



హత్య

నిహావంద్ (ఈరాన్) యుద్ధంలో ఒక ఖైదీని పట్టుకొన్నారు. అతని పేరు ఫీరోజ్. అతన్ని అబూ లూలూ అని కూడా అంటారు. అతణ్ణి ముగీర బిన్ షుఐబ (రజి) బానిసగా చేసుకొన్నారు. ముగీర బిన్ షుఐబ (రజి) గారు విధించిన పన్ను గురించి ఉమర్ (రజి) గారి దగ్గర చెప్పుకొన్నాడు ఫీరోజ్. విచారించిన తర్వాత ఉమర్ (రజి) గారి నిర్ణయం తనకు అనుకూలంగా లేదని ఉమర్ (రజి)పై పగపట్టాడు. ఒక రోజు హజ్రత్ ఉమర్ (రజి) గారు ఉదయం నమాజు చేయించడానికి ముందుకు వచ్చారు. ఫీరోజ్ అవకాశం చూసి కత్తితో ఆరు పోట్లు పొడిచాడు. ఉమర్ (రజి) గారు అక్కడికక్కడే కుప్పకూలారు. ఆ నమాజ్‌ను హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) గారు చేయించారు. నమాజుకు వచ్చిన వారు ఫీరోజ్‌ను పట్టుకోవడానికి ప్రయత్నించగా అతడు అనేక మందిని గాయపరుస్తూ చివరకు అదే కత్తితో పొడుచు కొని చనిపోయాడు. ఈ సంఘటన హిజ్రీ శకం 26 వ సంవత్సరం, జిల్‌హజ్జ మాసం-క్రీ.శ. 644లో జరిగింది. మూడు రోజులు గాయాలతో బాధ పడ్డారు. ఇక తాను ఎంతో కాలం జీవించనన్న విషయం ఉమర్ (ర) గారికి అర్థమయ్యింది. తనయుడు అబ్దుల్లాహ్ (రజి)ను హజ్రత్ ఆయిషా (రజి) దగ్గరికి పంపించి తన విన్నపంగా ప్రవక్త (స) గారి సమాధి ప్రక్కన ఖననం చేయడానికి అనుమతిని కోరారు. ఉమర్ (రజి) గారి విన్నపానికి ప్రాధాన్యతనిచ్చి అయిషా (రజి) అనుమతి నిచ్చారు. ఈ విషయం తెలుసుకున్న ఉమర్ (రజి) **"ఇదే నా చివరి పెద్ద కోరిక. అల్‌హమ్దులిల్లాహ్. అల్లాహ్ దయవలన అది ఈరోజు నెరవేరింది"** అన్నారు. తన మరణానంతరం ఇంటిని అమ్మి అప్పు తీర్చ వలసిందిగా కోరారు. తన తర్వాత ఖలీఫా విషయమై 6 మంది పేర్లను సూచించారు. ముఖ్యంగా ముహాజిర్లను, అన్సారులను, పల్లె వాసులను, ఇతర పట్టణాలకెళ్ళి స్థిరపడిన అరబ్బులను, జిమ్మీలను అందరినీ కలుపుకొని వారి హక్కులను నెరవేర్చేవారిని ఎన్నుకోండని సలహా ఇచ్చి కన్ను మూశారు!

ఇన్నాలిల్లాహి వఇన్నా ఇలైహి రాజిఊన్!!

ఆదర్శ రాజ్య ప్రణేత హజ్రత్ ఉమర్ (రజి) చేసిన గొప్ప సంస్కరణలు

- బైతుల్ మాల్‌ను (ప్రభుత్వ ధనాగారం) శాశ్వతంగా నెలకొల్పారు.
- న్యాయస్థానాలు స్థాపించి న్యాయమూర్తులను నియమించారు.
- హిజ్రీ శకం తేదీ, నెల, సంవత్సరాల లెక్క నిర్ణయించారు.
- సైనిక, రెవెన్యూ కార్యాలయాలను స్థాపించారు
- భూములను సర్వే చేయించారు, నీటి సౌకర్యం కోసం కాలువలు త్రవ్వించారు.
- జనాబా గణాంక పద్ధతిని ప్రవేశ పెట్టారు.
- క్రొత్త క్రొత్త పట్టణాలను నిర్మించారు.
- మొత్తం దేశాన్ని వివిధ జిల్లాలుగా విభజించి, వాటి పాలన కోసం గవర్నర్లను నియమించారు.
- జైళ్ళను నెలకొల్పారు. దేశ బహిష్కరణ శిక్ష ప్రవేశ పెట్టారు.
- పోలీసు శాఖను స్థాపించారు.
- నిరుపేద క్రైస్తవులు, యూదులకు పించన్లు మంజూరు చేశారు.
- పాంచన శాలలు, గ్రంథాలయాలను స్థాపించారు.
- తరావీ నమాజ్ సామూహిక పద్ధతిని ప్రవేశ పెట్టారు.
- విదేశాల నుండి వచ్చే సరుకుపై సుంకం, వ్యాపార గుర్రాలపై జకాత్ ప్రవేశపెట్టారు.
- వివిధ పట్టణాలలో అతిథి గృహాలను నిర్మించారు.
- సైనికి స్థావరాలు, బ్యారక్ నిర్మింపజేశారు.
- వార్తా సంగ్రాహకులను నియమించారు.
- ఫజ్ర్ నమాజ్ అజాన్ (పిలుపు)లో "అస్సలాతు ఖైరుమ్మిన న్నౌమ్" (నిద్రకంటే నమాజ్ శ్రేష్ఠమైనది) అనే వాక్యాన్ని అదనంగా చేర్చారు.
- మసీదులో ఉపన్యాసం ఇచ్చే పద్ధతి ప్రవేశ పెట్టారు.
- మసీదుల్లో రాత్రిపూట దీపాలను వెలిగించే ఏర్పాటు చేయించారు.
- వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ పద్ధతి ప్రవేశ పెట్టారు.
- ఉపాధ్యాయులకు, ఇమాములకు, ముఅజ్జిన్‌లకు జీతాలు నిర్ణయించారు.
- మద్యపానం శిక్షను 80 కొరడా దెబ్బలకు పెంచారు.
- ఖుర్‌ఆన్ (సూరాల) కూర్పు చేయించమని హజ్రత్ అబూబకర్ (రజి)కు పదే పదే చెప్పి ఆ పని చేయించారు.
- కవులు తమ కవితల్లో ఎవరిని నిందించకూడదని, స్త్రీలను గురించి ప్రస్తావించకూడదని ఆంక్షలు విధించారు. ఆంక్షలను ఉల్లంఘించే వారికి శిక్ష కూడా నిర్ణయించారు.

telgo.indd 19 5/3/11 1:30 PM

- ముహమ్మద్ హుసైన్ బొర్రా

లజ్జ



దైవప్రవక్త(స) ఇలా బోధించారు: "లజ్జా గుణం వల్ల మేలే జరుగుతుంది"

(బుఖారి,ముస్లిం)

అసలు లజ్జ అంటే ఏమిటి ? సిగ్గు లేదా బిడియం. ఇందులో శారీరక బిడియం, నైతిక బిడియం అని రెండు రకాలున్నాయి. ఒక మనిషికి ఆచ్ఛాదన ఉండవలసిన శరీరావ యావాలపై నుండి ఆచ్ఛాదన తొలగిపోతే అది ఆ మనిషికి సిగ్గుచేటవుతుంది కదా? అదే స్త్రీలైతే అదింకా సిగ్గు చేటైన విషయమౌ తుంది. నీతి రాహిత్యమైన కొన్ని చేష్టలను చేసే వారిని మనం సిగ్గు లేని వాళ్ళంటాము.

మనిషి నీతి నియమాలను గోతిలో పాతి ఉప్పు పాతరేసిన ఈ కాలంలో శారీరక బిడి యం అనేది ప్రతిక్షణం కృశించి నశించి చస్తూనే ఉంది. నట్టనడి వీధిలో విలువల వలు వలూడ్చి అశ్లీలం మరీ వికటాట్టహాసం చేస్తూంది. కానీ ఈ అశ్లీలం అనే రొంపిలో పీకల్లోతు కూరుకుపోయిన అతివలకు ఇది ఏ మాత్రం సిగ్గనిపించటం లేదు.

దురదృష్టవశాత్తూ ఈ రోజు ఈ అశ్లీలం అనేది అందానికి ఫ్యాషన్లకు ఒక మాధ్యమై పోయింది. ఇంకా బురదను అస్వాదించే వరా హాల్లా కొంత మంది తల్లిదండ్రులు ఈ అశ్లీల ప్రపంచంలో ఒక వెలుగు వెలగమని తమ పిల్లల్ని ప్రోత్సహిస్తున్నారు. **"అల్ వాలి దాన్ మద్రసతుల్ ఊలా"** అంటే తల్లి దండ్రులే పిల్లలకు ప్రథమ పాఠశాల. వారు తమ పిల్లలి ఎలా పిలుస్తారో పిల్లలు అలాగే పలుకుతారు.

మానవుల మూల పురుషులైన ఆదం మరియు హవ్వాలను మభ్యపెట్టి, మోసగించి వారి వలువలను ఊడదీయించిన షైతాన్ కూడా ఈరోజు ఫ్యాషన్ పేరిట పడతలు పడే పాట్లు చూసి బహుశా సిగ్గుతో తలదించుకుని ఉంటాడు.ఈనాడు ఫ్యాషన్ షోల పేరిట జరిగే ప్రదర్శనలను వస్త్ర ప్రదర్శన అనటంకంటే కూడా అంగ ప్రదర్శన అంటే భేషుగ్గా ఉంటుందేమో!

ఏ వస్త్రాలను ప్రొమోట్ చేయాలనుకుం టున్నారో శరీరం మీద వాటి శాతం తక్కువ గా ఉంటుంది. ఈ ఫ్యాషన్ షోలలో వయ్యా రంగా పడతులు నడుచుకుంటూ వస్తుం టారు. ఉన్నట్టుండి వాళ్ళ గుడ్డలు కొన్ని ఊడి పోతాయి. ఏంటయ్యా కారణమంటే వార్డ్ రోబ్ మాల్ ఫంక్షన్ అంటారు. నిజంగానే వార్డ్ రోబ్ మాల్ ఫంక్షన్ అయినా కూడా కొన్ని వందల మంది ప్రత్యక్షంగా మరి కొన్ని వేల మంది టీవీల ద్వారా వీక్షిస్తున్నప్పుడు పరాయివారికి కనిపించకూడనివి అలా అదాటున కనిపించేసరికి ఎంత ఎబ్బెట్టుగా ఉంటుంది. అలాగే పేరు కోసమో ఒక గుర్తింపు కోసమో మాత్రం కావాలని నిస్సిగ్గు గా అలా చేస్తే అంతకంటే దౌర్భాగ్యం ఇంకే మైనా ఉంటుందా ?

హుదైఫహ్ ఇబ్నుల్ యమాన్ ఇలా చెప్పారు: 'ఏ వ్యక్తి అయితే సాటి మనుషుల పట్ల సిగ్గు శరాల అనుభూతి కలిగి ఉండడో అలాంటి వ్యక్తి వల్ల ఏ ఉపయోగమూ ఉండదు.

అల్లాహ్, ఆదం హవ్వాలను ఏ చెట్టు ఫలాన్నైతే తినొద్దని వారించాడో, షైతాన్ అదే చెట్టు ఫలాన్ని తినిపించి వారిని దివి నుండి భువికి దిగజార్చాడు. దివ్య ఖుర్ఆన్‌లో సూర అల్ ఆరాఫ్ వచనాలు (19-25) "ఆదం నీవు నీ భార్య ఇద్దరూ స్వర్గంలో నివ సించండి. ఇక్కడ మీరు కోరిందల్లా తింటూ హాయిగా ఉండండి. అయితే ఆ చెట్టు దగ్గరికి మాత్రం వెళ్ళకండి. వెళ్ళారా, మీరు దుర్మార్గు లలో చేరిపోతారు. అప్పుడు షైతాన్ వారిని ఇలా మభ్యపెట్టాడు: మీ ప్రభువు మిమ్మల్ని ఆ చెట్టు దగ్గరికి ఎందుకు పోవద్దన్నాడో తెలుసా? మీరు దైవదూతలైపోతారని లేదా మీకు శాశ్వత స్వర్గ జీవితం లభిస్తుందని దాని దగ్గరకు మిమ్మల్ని పోనివ్వకుండా వారించాడు, పైగా నేను మీకు శ్రేయోభి లాషిని అని నమ్మపలికాడు.

అలా షైతాన్ వారిరువురిని వలలో వేసు కున్నాడు. వారిరువురు ఆ నిషేధిత వృక్షాన్ని రుచి చూసారు. దాంతో వెంటనే వారి మర్మా వయాలు ఒకరి ముందు మరొకరివి బహి ర్గతమైపోయాయి. వారు సిగ్గుతో బిక్క చచ్చి పోయి స్వర్గంలోని ఆకులతో తమ దేహాలను కప్పుకోవడానికి ప్రయత్నించారు. అప్పుడు వారి ప్రభువు– "నేను మిమ్మల్ని ఆ చెట్టు వద్దకు పోవద్దని వారించలేదా? షైతాన్ మీకు బద్ధవిరోధి అని చెప్పలేదా? అని అడి గాడు. ప్రభూ! మాకు మేమే అన్యాయం చేసుకున్నాం. నీవు కనికరించి మమ్మల్ని క్షమించకపోతే మేము సర్వనాశనమై పోతాము అని అన్నారు. దానికి అల్లాహ్ దిగి పోండి మిరంతా ఒకరికొకరు శత్రువులు. మీరు ఒక నిర్ణీత కాలం వరకు భూలోకంలో గడపవలసి ఉంది. మీకక్కడ నివాసం, జీవనోపాధి వగైరా సదుపాయాలున్నాయి. అక్కడే మీరు జీవించాలి, అక్కడే మీరు చని పోవాలి. చివరికి అక్కడ్నుంచే మిమ్మల్ని పునర్జీవితంతో తిరిగి లేపడం జరుగుతుంది.

ఆనాటి నుండి షైతాన్ తన సిగ్గులేని వికృత చేష్టలతో మానవ జాతిని అనేకానేక పేర్లతో, సాకులతో అశ్లీలపు రొంపిలోకి దించి పబ్బం గడుపుకుంటున్నాడు. చివరికి దైవ భక్తి పేరు తో నగ్న ప్రదక్షిణలకు, మర్మావయాల ఆరా ధనకు కూడా ప్రేరేపిస్తున్నాడు.

ఇదే దైవ భక్తిని అడ్డు పెట్టుకుని నేటి కుహనా బాబాలు, యోగులు నయాన్ భయాన్ తమ శరీర వాంఛలు తీర్చుకుంటూ అవి దైవకార్యమని బాహాటంగానే ప్రకటి స్తున్నారు. వాహ్! షైతాన్ నీ కమిట్ మెంట్‌కూ, ప్లానింగ్‌కూ తిరుగు లేదురా బాబూ!

పూర్వం అంటే అజ్ఞాన కాలంలో బహుదైవారాధకులు కాబా చుట్టూ నగ్న ప్రదక్షిణ చేసేవారు. ఖుర్ఆన్ ద్వారా అల్లాహ్ ఈ అశ్లీలాన్ని నిషేధించాడు.

(మిగతాది 20వ పేజీలో)

telgo.indd 20 5/3/11 1:30 PM

- అబుల్ తాసన్

నేటి బాలలే రేపటి పౌరులు - 13

ఇప్పుడు కథ కోసమమంటూ ఓ రోజును కేటాయించాడు అలీ. పిల్లల్లో సంభాషణా మర్యాదల్ని కూడా నూరి పోస్తున్నాడు. విద్యార్థులకు శారీరక పరీక్షలు కూడా జరుపుతూ ఉన్నాడు. బాల విహార్ ఎంతో రసవంతంగా ముందుకు సాగుతూ ఉంది.

ఆ రోజు సోమవారం. కథ చెప్పాల్సిన దినం కూడా అదే. విద్యార్థులందరూ సంతోషంగా ఉన్నారు. అయితే 'ఉమర్' కి ఈ రోజు పెద్ద సమస్యే వచ్చి పడింది. వచ్చీరాగానే ఇలా అన్నాడు: హాజ్రత్! క్యా ధోకా దేనా జాయిజ్ హై?. 'నహీ బేటా! మోసం చేయడం మహా పాపం' అని నచ్చజెప్పాడు అలీ. అలాగైతే దుకా ణం యజమానీ ముజీబ్ సాబ్ పిల్లల నుండి డబ్బు ఎక్కువ తీసుకుని వస్తువులు తక్కువ ఇస్తున్నారు ఎందుకు? బాబూ! ఒకరు ఇవ్వడం వల్ల ఇవ్వకపోవడం తప్పు ఒప్పుగా మారదు. అలా ఎవరు చేసినా అది తప్పే. ఒకడన్నాడు: హాజ్రత్! ఆజ్ కహానీకా దిన్ హై. కథ చెప్పండి ప్లిజ్! సరే ఈ రోజు 'షుఐబ్' (అ) గారి కథ చెబుతాను. శ్రద్ధగా వినండి! అని కథ ప్రారంభించాడు అలీ.


హాజ్రత్ షుఐబు (అ) రెడ్ సీ (ఎర్ర సముద్రం) తీరంలో **'మద్యన్'** అనబడే ఊరిలో నివసించేవారు. ఈ పట్టణం అటు ఇరాక్ మరియు మసర్ (ఈజిప్టు)కి, ఇటు యమన్ మరియు షామ్ దేశానికి మధ్య పడుతుంది. ఈ భౌగోళిక కారణం గానే అక్కడి ప్రజలు వ్యాపారం చేసే వారు. దైవం వారికి ప్రసాదించిన సక్రమ ఆదాయంతో వారు సంతృప్తి చెందలేదు. వారిలోని ప్రతి ఒక్కరూ మోసగించడం ప్రారంభించారు. ప్రజల నుండి వస్తువు లను కొనేటప్పుడు మాత్రం ఎక్కువ సరకును రాబట్టుకునేందుకు ప్రయత్నించే వారు. కానీ అమ్మేటప్పుడు మాత్రం తగ్గించి ఇచ్చేవారు.

అలాగే ఇతరత్రా దేశాల నుండి వచ్చే వర్తక బృందాలను నిలువు దోపిడి చేసి దోచుకునేవారు. ఒక్కోసారి ప్రాణాలు తీయడానికి సయితం వెనుకాడేవారు కాదు. కారణం కనక కామం, ప్రాపంచిక వ్యామోహం. అల్లాహ్‌ను తన నిజ ఆరా ధ్యునిగా ఎంచని ప్రతి వ్యక్తి నిస్సిగ్గుగా ఈ అఘాయిత్యాలకు పాల్పడేవాడు. ఊరి బైట ఓ పెద్ద వృక్షం ఉండేది. వారు ఆ ప్రాంతాన్ని మ్రొక్కేవారు. కాని ఆ ప్రాంతాను పుట్టించిన మాధవుణ్ణి మరచారు. అందుకే వారిని 'అస్హాబుల్‌ఐక' (ప్రాంతాను మ్రొక్కేవారు) అని పేర్కొనింది పవిత్ర ఖుర్‌ఆన్.

వారి ఈ ద్వంద్వ ప్రవృత్తిలో ప్రకృతి పరమైన పరివర్తన తీసుకురమ్మని అల్లాహ్, హాజ్రత్ షుఐబు (అ) గారిని వారి వద్దకు ప్రవక్తగా చేసి పంపాడు. వారిని చక్కదిద్దా లన్న సదుద్దేశ్యంతో ఆయన ఇలా ఉపదే శించారు: "అల్లాహ్‌ను మాత్రమే ఆరాధిం చండి. తూనికల్లో, కొలతల్లో సరుకులు తగ్గించి ఇవ్వకండి. న్యాయంగా సరయిన కొలమానాలతో పూర్తిగా తూచి ఇవ్వండి. ప్రజలకు రావలసిన సరకులు తగ్గించి వారికి నష్టం కలిగించకండి. మనుషుల ప్రాణాలు తీస్తూ - వారి దోచుకునే నేర ప్రవృత్తిని విడనాడండి. లోకంలో కలహాలు, కల్లోలాలు రేకెత్తిస్తూ తిరగ కండి. అక్రమ లాభార్జనకన్నా అల్లాహ్ ప్రసాదించే సక్రమమైన సంపదే మీకు శ్రేయస్కరం" అన్నారు.

దానికి వారిలా బదులిచ్చారు: "షుఐబ్! ఏమిటయ్యా నువ్వు చెబుతున్నది? మా తాతముత్తాల కాలం నాటి నుండి వస్తున్న ఈ దైవాలను (రాయి -రప్పలు, పాము -పుట్టలు, చెట్లు-చేమలను) ఆరాధిం చడం మేము మానుకోవాల్నా? మా ధనాన్ని మాకిష్టమొచ్చినట్లు ఖర్చు పెట్టు కునే అధికారం కూడా మాకు లేదా? ఇదేనా నీ నమాజు నీకు నేర్పుతున్న నీతి? వెళ్ళవయ్యా... వెళ్ళు... వచ్చావు పెద్ద పుడింగిలా... చూడు నీవు చెప్పేవాటిలో ఒక్కటి కూడా మాకసలు అర్థం కావడం లేదు... నీ ఈ సుత్తిని ఆపెయ్యి... లేదా నిన్ను రాళ్ళతో కొట్టి చంపేస్తాం ఆఁ... అర్థమయ్యిందా..!' అంటూ ఎంతో దారుణంగా, అమర్యాదగా ప్రవర్తించారు ఆ ధనపిపాసులు. అయినా ఆయన మాత్రం వారిని మంచిగానే బోధిస్తూ, హెచ్చరిస్తూ ఉండేవారు. అందుకే ఆయన్ను **'ఖతీబుల్ అన్బియా'** అని బిరుదు కూడా లభించింది. ఆయన మాట అతి కొద్ది మంది మాత్రమే విన్నారు.

అనుకోకుండా ఒక రోజు మహా భయంకరమైన ఎండ మొదలయ్యింది. గాలుల సంచారం సయితం ఆగి పోయింది. చెట్టు నీడన వెళ్ళినా ఎండ తీవ్రత తగ్గడం లేదు.



ఆ భయంకర వడ దెబ్బకి వారి పోలాలు, తోటలు అన్నీ కాలి పోయాయి. పెద్ద కరువు వారిపై విరుచుకు పడింది. చెరువులు, బావులు, కుంటలు, నదులు అన్నీ ఎండిపోయాయి. అల్లాహ్ షుఐబ్ (అ)ను తన అనుచర సముదాయాన్ని వెంటబెట్టుకుని దుర్మార్గులుంటున్న ఆ ప్రాంతాన్ని వదలి వెళ్ళిపొండని ఆజ్ఞాపిం చాడు... ఆయన వెళ్ళిపోయారు. అలా చాలా కాలం గడిచింది... కానీ వాన మాటే లేదు..!

telgo.indd 21 5/3/11 1:30 PM

లజ్జ

(11వ పేజీ మిగతా భాగం)

దివ్య ఖుర్‌ఆన్ లోని సూర అల్ ఆరాఫ్ వచనం (26)

ఓ ఆదం సంతానమా! మీరు మీ మర్మావయాలను కప్పుకోవ డానికి, మీ దేహానికి రక్షణగా, అలంకరణగా ఉపయోగపడ టానికి మేము మీకు దుస్తులు ప్రసాదించాము.

అందుచేత ఇస్లాం పూర్తి ఆచ్ఛాదనతో కూడిన దుస్తులకు ఎంతో ప్రాధాన్యతనిచ్చింది. అయితే మనసులో దైవభీతి లేకపోతే దుస్తులు కేవలం అలంకార ప్రాయంగానే మిగిలిపోతాయి. దివ్య ఖుర్‌ఆన్‌లోని సూర అల్ ఆరాఫ్, వచనం 26లో ఆఖరి భాగం ఇలా చెపుతుంది: "అయితే అన్నింటికంటే భయభక్తుల దుస్తులే ఎంతో శ్రేష్ఠమైనవి. ఇది మీరు జ్ఞాపకముంచుకునేందుకు అల్లాహ్ చేసిన సూచనలలో ఒక సూచన."

ఇస్లాంలో విశ్వాసానికి సంబంధించిన ఎన్నో విషయాలున్నాయి. వాటిలో బిడియం కూడా ఒకటి. అందుకే ప్రవక్త(స) బిడియం సగం విశ్వాసంతో సమానం అన్నారు. సిగ్గే స్త్రీలకు సింగారం, సింగారాలంకరణం లేని అందం తావి లేని పువ్వు వంటిది.

ఇంకా ఇలా కూడా చెప్పబడింది: విశ్వాసానికి డెబ్భై పైచిలుకు శాఖలున్నాయి. అందులో ఉత్తమమైనది లా ఇలాహ ఇల్లల్లాహ్ (అల్లాహ్ తప్ప నిజమైన ఆరాధ్య దైవం ఎవరూ లేరు) అని పల కటం. మరి చివరిది మనం నడయాడే దారిలో నష్టపరచే ఏదైనా వస్తువును (ముల్లు, మేకు మొదలైనవి) తొలగించటం. లజ్జ అనేది విశ్వాసంలో ఒక శాఖ.

కాబట్టి విశ్వాసులుగా, ముస్లింలుగా మనమొక ఉత్కృష్ట ధర్మానికి ఈ భూమి మీద ప్రాతినిధ్యం వహిస్తున్నప్పుడు ఆ ధర్మ ప్రకారమే మనం నడుచుకోవాలి. ఎందుకంటే ఈ భూమి మీద మనం చేసే ప్రతి పనికి అక్కడ జవాబు చెప్పవలసి ఉంది. అందుకే మన పిల్లలకు ధర్మ సమ్మతమైన జీవితానికి అవసరమైన రంగాల వైపే అడుగులు వేసే విధంగా ప్రోత్సహించాలి.

'అన్నీ వున్న విస్తరాకు అణగిమణగి ఉంటుంది, ఏమీ లేని విస్త రాకు ఎగిరెగిరి పడ్తుందని' సామెత. శారీరక, నైతిక బిడి యాలున్న వాళ్ళందరూ మానవత్వానికి నిలువెత్తు నిజరూపాలు. అదే ఆరెంటినే వదిలేసిన వారిని చూసి షైతాన్ కూడా బహుశా "ఒరే మీ దుంప తెగ, మిమ్మల్ని దైవమార్గం నుండి అపమార్గం పట్టించేందుకు నేను వలువలూడదీస్తే; మీరు నన్నే సిగ్గు పడేలా చేస్తున్నారే అని తప్పకుండా అనుకుంటూ వుంటాడు.

నెలవంక ఉత్తరాలు

వెన్నెల్ని పంచే నెలవంక

అస్సలాము అలైకుమ్

నా పేరు అహ్మద్. నేను ఇస్లాం స్వీకరించి 6 నెలల అవుతుంది. నెలనెలా వెన్నెల్ని పంచే **నెలవంక** చాలా బాగుంది. మనిషి ఎలా జీవించాలి? ఎదుటి వారి పట్ల ఎలా ప్రవర్తించాలి? మనం ఆత్మ గౌరవంతో ఎలా బ్రతకాలి? భార్యాపిల్లల్ని ఎలా చూసుకోవాలి? అన్నీ నేర్పుతుంది **నెలవంక**. నమ్మకం లేని చోట ఏదీ ఉండదు. ఈ లోకంలో ప్రతీది నమ్మకంతోనే ముడిపడి ఉంది. తప్పు ప్రతి ఒక్కరితోనూ జరుగుతుంది. అయితే తప్పు అని తెలిసాక దాన్ని నిర్ధాక్షిణ్యంగా వదులుకోవాలి. దైవ సన్నిధిలో దీనాతిదీనంగా ప్రాధేయ పడాలి. కన్నవారి పట్ల కనికరం కలిగి ఉండాలి. చెడు వ్యసనాలకు దూరంగా మసలుకోవాలి. ఈ సృష్టిలో దైవ సహాయం లేకపోతే ఏ ప్రాణి బ్రతకదు. కాబట్టి మనం ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండటం అలవాటు చేసుకోవాలి. మనం మాట్లాడే ప్రతి మాట ఎదుటి వారి మనసుకు హత్తుకునే లా ఉండాలి.

– అహ్మద్

కాలం విలువైనది

అస్సలాము అలైకుమ్

నెలవంక ప్రేక్షకులకు చిన్న మనవి. నా పేరు కుమారీ. నేను ఇస్లాం స్వీకరించి 8 నెలలయింది. నేనెంతో సంతోషంగా ఉన్నాను. **నెలవంక** పుస్తకాలు, ఎడారి పువ్వు చదువుతూ ఇస్లాం గురించి తెలుసుకున్నాను. ఇస్లాం స్వీకరించిన తర్వాత హజ్ ఉమ్రాలు చేయాలన్న కోరిక. కాని బీదదాన్ని. మా కఫీలాను సంప్రదించాను. వారు సంతోషంగా సరేనన్నారు. అప్పుడు అల్లాహ్ గృహాన్ని ప్రత్యక్షంగా చూశాను. నాలో ఏదో తెలియని ఆనందం. పూర్వం నేను అనేక మందిరాలకు వెళ్ళాను కానీ; ఇటువంటి అనుభూతి ఎక్కడా కలుగలేదు. 4 సంవత్సరాలుగా ఇస్లాం స్వీకరించకుండా ఉన్నందుకు ఎంతో బాధ పడ్డాను. కఫీలా అంది: "ఎందుకేడుస్తున్నావు?" అని. నేను చాలా ఆల స్యం చేశాను అని ఏడుస్తూనే బదులిచ్చాను. **నెలవంక**లో వచ్చిన కాలం సాక్షిగా అన్న వ్యాసం గుర్తుకు వచ్చింది. కాలం ఎంతో విలువైనదన్న వాస్తవమైన స్పృహ అప్పుడే కలిగింది. ఆ తాదా త్మ్యంలో ఎన్ని సార్లు కాబా చుట్టు తిరిగానో నాకే తెలియదు. ఒక పిచ్చిదానిలా కాబాను చూస్తూ ఉండిపోయాను. నాకు కొత్త జన్మ లభించిందనిపించింది. అల్లాహ్ చాలా గొప్పవాడు. సర్వలోకాల కు సృష్టికర్త. ఆయన పంపిన అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స). ఆయన చరిత్ర చదువుతుంటే కళ్ళు అశ్రుసిక్తం అవుతాయి.

– ఫాతిమా

telgo.indd 22 5/3/11 1:31 PM

వివేచన

దైవ దౌత్యపు 45 భాగం నిజమైన కల....!

దైవ ప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: "మీలో ఎవరైనా మంచి కల కంటే తనకు చాలా ఆప్తుడైన వానికి మాత్రమే చెప్పాలి. ఒకవేళ పీడ కల వస్తే, దాన్ని కీడు నుండి అల్లాహ్ శరణు కోరుకోవాలి. ఎవరితోనూ ప్రస్తావించకూడదు. ఇలా గనక అతను చేస్తే అది అతనికి హాని చేయదు". (బుఖారీ, ముస్లిం)



ప్రవక్త (స)ను కలలో చూసిన వ్యక్తి సకల విధముల దుఃఖాల నుండి విముక్తి పొందుతాడు. అయితే ప్రవక్త (స) వారి ఉగ్రరూపాన్ని , ఆయనలో అసహనాన్ని చూస్తే మాత్రం అతను జాగ్రత్త పడాలి.

కలలో దైవప్రవక్తల ను చూడటం వల్ల పది శుభాలు కలుగుతాయి. కారుణ్యం,అనుగ్రహం, పరువు ప్రతిష్ట, పెద్దరికం, కీర్తి ఐశ్వర్యం, ప్రజాదరణ, సౌభాగ్యం, వికమత్వం, ఆత్మ బలం, ఇహపరాల సాఫల్యం - కల చూసిన ప్రాంత ప్రజల శ్రేయోశుభాలు.



గుర్రాన్ని కలలో చూడటం గౌరవాదరణలకు సంకేతం. గుర్రంతో పోరాడి ఓడిపోయి నట్లు కలొస్తే చూసిన వ్యక్తి పాప కృత్యాలకు పాల్పడుతున్నాడని అర్థం. నగ్నంగా గుర్రపు స్వారీ చేసినట్లు కలొస్తే అవమానం పాలవుతాడని అర్థం.



తలుపును కలలో చూస్తే మంచి హోదా లభిస్తుంది. అలాగే పెద్ద చేపలను కలలో చూడటం శుభ సూచకం. చిన్న చేపలను కలలో చూడటం ఆందోళనకు సంకేతం. పరుగెడుతూ కలొస్తే శత్రువు నుండి రక్షణ లభిస్తుంది.




కలలో దైవ అంతిమ గ్రంథం ఖుర్ఆన్ను చూడటం ఎంతో శుభప్రదం. ఖుర్ఆన్లోని 114 సూరాలలో ఏ ఒక్క సూరా వింటూ, చదువుతూ కలొస్తే ఆ సూరాను బట్టి సారాశం ఉంటుంది. అది శుభప్రదమే అవుతుంది.





గాలిలో ఎగురుతున్నట్లు కలొస్తే ప్రయాణం చేస్తా అర్థం. ఆకాశంలోకి ఎగురుతూ మేఘాల్లోకెళ్ళ మాయమై మళ్ళి తిరిగి రాకపోతే అది చెడుకి సంకేతం.



సకల వస్తువులను దేవుడు నీటితో సృజించాడని ఖుర్ఆన్లో ఉంది. ఇంట్లో మంచి నీళ్ళు పుష్కలంగా ఉన్నట్లు కల వస్తే సంతోషానికి, సౌభాగ్యానికి సంకేతం. అయితే నీటి రంగు, రుచిని బట్టి అర్థం మారవచ్చు. అలాగే సకాలంలో వానను చూడటం శుభసూచకం.



కలలో మన పల్లు చూడటం అంటే కుటుంబ సంభ్యులని అర్థం. పై పల్లు మగవారైతే, కింది పల్లు ఆడవారు. ప్రక్కటి పల్లు బాబాయి, వారి సంతానం. లోపలి పల్లు దూరపు సంతోషానికి సంకేతం. పంటి స్థితిని బట్టి కుటుంబ సౌభాగ్యాసౌభాగ్యలు, ఆరోగ్యానారోగ్యాలు ఉంటాయి. పల్లు రాలి మట్టిలో పడక ఒడిలోనూ, చేతిలోనూ పడితే తమ్ముడో చెల్లో పుడతారని అర్థం.



కలలో మనిషి తన్ను తాను నగ్నంగా చూస్తే, వ్యక్తి బట్టి సారాంశం ఉంటుంది వ్యక్తి ఉత్తముడైతే అ అతనికి శుభసూచ వ్యక్తి చెడ్డవాడైతే అ అతని పాలిట కిడుగా పరిణ మిస్తుంది.

కొండ చిలువను కలలో చూస్తే బలమైన శత్రువున్నట్లు. దాన్ని చంపినట్లు కలొస్తే, శత్రువును జయిస్తారు. దాని మీద స్వారీ చేసినట్లు కలొస్తే శత్రువును లొంగదీసు కున్నట్లు.





కలలో కాబాను, హజ్ ఉమ్రాలను,చూడటం ఎంతో శుభసూచకం. అయితే కాబా స్థితిని బట్టి సారాంశం మారవచ్చు. హజ్రె అస్వద్ను, జమ్ జమ్ జలాన్ని చూడటం కూడా మంచికి సంకేతం.



అగాధంలోకి జారుకున్నట్లూ, ఎత్తైన ప్రదేశం నుండి దూకుతున్నట్లు కలొస్తే చెడు సంకేతం. మనిషి ఏ దేశస్తుడైనా, ఏ రంగు, రూపు గలవాడైనా ఆంతర్యంలోత్యా మనిషే. మనిషి కనే కలల్లో ఇవి కొన్ని, మరిన్ని వివరాల కోసం అల్లామా ఇబ్ను సీరీ (ర) గారి "కలల సారాంశం" (ఖాబీకీ తాబీర్) అనే గ్రంథాన్ని చదవగలరు.



?



అసత్యం శాశ్వతమా?

మౌఢ్యం చీకటి. మౌఢ్యం ఆధీనం. మౌఢ్యం బానిసత్వం. మౌఢ్యాన్ని ఛేదించగల ఆయుధం - సత్యం. మనిషి సత్యాన్వేషి కావాలి. సత్య జీవనం మానవుని ప్రకాశవంతం చేస్తోంది. అసత్యం మృత్యువు అయితే, సత్యం జీవితం. నిజం వెలుగు ముగ్గయితే, అబద్ధం కర్రి మబ్బు. కనుకనే సత్యం కానని మనిషి అప్పుడప్పుడు భయంతో కేక వేస్తాడు. ఏమని?

'అసతోమా సద్గమయ
తమసోమా జ్యోతిర్గమయ
మృత్యోర్మా అమృతంగమయ' అని.

అసత్య మార్గాలు కాదు; నాకు సత్య మార్గం కావాలి. అన్యాయాలు, మోసాలు, దౌర్జన్యాల చీకటి కాదు; నాకు న్యాయ కాంతి కావాలి. మూఢనమ్మకం అనే ఈ మృత్యువు నుండి నాకు శాశ్వతమైన అమరత్వం కావాలి. సమాధానంగా ఖుర్‌ఆన్ ఇలా అంటుంది:

"భూమండలంపై ఉన్నవారంతా నశించి పోవలసినవారే. ఎప్పటికీ మిగిలి ఉండేది ఘనత, గౌరవం గల నీ ప్రభువు అస్తిత్వం మాత్రమే". (అర్‌రహ్మాన్: 26, 27)

అభిమాన పాఠకులారా!

నాడు - 'నేనే మహోన్నత దైవం' అని బీరాలు పోయిన ఫిర్‌ఔనూ మరణించాడు. 'నాకు మించిన దైవం లేడని' గొప్పలు పోయిన నమ్రూదూ చచ్చాడు. వారిలా 'మేమే దైవాంశ సంభూతులం' అని ప్రకటించుకున్న ఎందరో కాటి మట్టిలో కలిసిపోయారు.

నేడు -పుట్టపర్తి సాయి బాబా మరణించాడు. ఆయనలా 'నేను అవతార పురుషుణ్ణ'ని చెప్పుకునే వారందరూ ఏదో ఒక రోజు ఖచ్చితంగా మరణిస్తారు. కాబట్టి -

- పుట్టి గిట్టేవాడు కాదు దేవుడు; పుట్టుక మరణాలకతీతుడు, అధిపతి దేవుడు.
- తిండిబోతు కాదు దేవుడు; సమస్త జీవరాసులకు జీవనోపాధిని ప్రసాదిస్తున్నవాడు దేవుడు.
- అలసిసొలసి విశ్రాంతి తీసుకునేవాడు కాదు దేవుడు; విశ్వ వ్యవస్థను నిరాఘాటంగా నడుపుతున్న వాడు దేవుడు.
- మందుమాకు అవసరం గలవాడు కాదు దేవుడు; అందరికీ స్వస్థతనిచ్చేవాడు దేవుడు.

అల్లాహ్; ఆయన తప్ప మరో దేవుడు లేనే లేడు. ఆయన సజీవుడు, నిరంతుడు. భూమ్యాకాశాల మధ్య ఉన్నదంతా ఆయనదే. ఆయన ఒక్కడే. నిరపేక్షాపరుడు. ఆయనకు సంతానం లేదు. ఆయన కూడా ఎవరికీ సంతానంగా లేడు. ఆయనకు సరితూగగలిగే వస్తువేదీ లేదు. కాబట్టి నిజం తెలుసుకోండి. చెట్టు, పుట్ట, రాయి, రప్ప, మనిషి, మృగాన్ని కొలవడం మానండి. సత్యం అనే వెలుగులో జీవించండి. మీ ప్రభువు శాశ్వత స్వర్గ వనాలలో విహరించండి.

